Follow: @ANNTELUGU

ANN తెలుగు

08-09-2025

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 275 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## పార్టీ మారిన ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ కీలక సమావేశం

### జూబ్లిహిల్స్‌లో పోటీ చేస్తానన్న దానం

జూబ్లిహిల్స్, ఖైరతాబాద్ రెండింటి గెలుపు బాధ్యతా నాదేనని ప్రతిపాదన

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా మారిన ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలు అత్యవసర భేటీ అయ్యారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసుల జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏం చేయాలనే అంశంపై సీఎం చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో భాగంగా బీఆర్ఎస్ నుంచి పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నోటీసులు జారీ చేశారు.

మిగతా 2లో


టాప్ న్యూస్



ప్రపంచం చూపు విజయవాడ ఉత్సవ్ వైపు

- కర్టెన్ రైజర్ ప్రారంభించిన సంయుక్తమీనన్
- మైసూర్ దసరాను మరిపించేలా ప్లాన్

03



బీజేపీతో సావాసం మంచిది కాదు

- కేసీఆర్‌కు సీపీఐ నారాయణ సూచన

02



సిద్దిపేట మోడల్ చిలిపి లీలలు

- కవిత టీమ్ సంచలన ట్వీట్
- కవితక్క అప్‌డేట్స్ తో వరుస కౌంటర్లు

02

## మూసీ ముందుకు

### హైదరాబాద్‌కు గోదావరి జలాలు

జంట జలాశయాలు నింపే పథకానికి నేడు సీఎం రేవంత్ శంఖుస్థాపన

2027 డిసెంబర్ నాటికి హైదరాబాద్ తాగునీటి అవసరాలు తీర్చేలా ప్లాన్

**హైదరాబాద్, మహా:** మూసీ పునరుజ్జీవన పథకంలో భాగంగా ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ చెర్వులను మంచినీటితో నింపేందకు ఉద్దేశించిన గోదావరి డ్రింకింగ్ వాటర్ స్కీమ్ ఫేజ్ - 2,3 పథకానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేస్తారు. రూ.7,360 కోట్లతో ప్రభుత్వం హమ్ విధానంలో ఈ ప్రాజెక్టును చేపడుతుంది. ఇందులో ప్రభుత్వం 40 శాతం పెట్టుబడి వాటా పెట్టనుండగా, కాంట్రాక్ట్ కంపెనీ 60 శాతం నిధులు సమకూరుస్తుంది. రెండేండ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాజెక్టులో భాగంగా మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి 20 టీఎంసీల నీటిని తరలిస్తారు.

మిగతా 2లో



## ఎమ్మెల్యే కసిరెడ్డిపై జనం భగ్గు

### కల్వకుర్తి ఎమ్మెల్యేకు బిగ్ షాక్

ఎవరి లబ్ది కోసం ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చారు

ఏకపక్ష నిర్ణయంతో చిన్న, సన్నకారు రైతులకు అన్యాయం

ఆగ్రహంతో ఆమనగల్లు హైవేపై రైతుల బైఠాయింపు.. నిరసన

ఎమ్మెల్యే కసిరెడ్డి దిష్టిబొమ్మ దహనం

ఆమనగల్లు, తలకొండపల్లి, మాడుగుల మండలాల రైతుల్లో అలజడి



**ఆమనగల్లు, మహా:** కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి పబ్లిక్ బిగ్ షాకిచ్చారు. ఎవరి లబ్దికోసం.. ట్రిపుల్ ఆర్ అలైన్ మెంట్ మార్చారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. మొదట్లో ఉన్న అలైన్ మెంట్ ఎమ్మెల్యే భూముల పక్కగా వెళ్ళడంతోనే మార్చారని, ఇపుడు పెద్దమొత్తంలో చిన్న, సన్నకారు రైతులం భూములు కోల్పోతున్నామంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ రోడ్డెక్కారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ట్రినుల్ ఆర్ పై కల్వకుర్తి నియోజకవర్గం రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి.

మిగతా 2లో



జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా

## రాజీనామా

- పార్టీ అంతర్గత విబేధాలతో స్వస్తి చెబుతూ నిర్ణయం
- గతేడాది అక్టోబర్ నెలలో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఇషిబా

వివరాలు 2లో

## బీజేపీ నాయకులు బిచ్చగాళ్ళు

### దేవుడి పేరు చెప్పకుండా ఓట్లు అడగలేరు

టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సంచలన కామెంట్స్

బీజేపీ నాయకుల బట్టలూడదీసేందుకే.. కాంగ్రెస్ కామారెడ్డి సభ

బండి సంజయ్ నీకు దమ్ముంటే సెక్యూరిటీ వదిలేసి తిరుగు

రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రంలో బిఆర్ ఎస్ పార్టీ ఉండదు



**కామారెడ్డి, మహా:** బీజేపీ నాయకుల బట్టలు ఊడదీసేందుకే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కామారెడ్డిలో 15 న బిసి సభ నిర్వహించబోతున్నామని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం కామారెడ్డిలో జరిగిన బీసీ సభ సన్నాహక సమావేశానికి ఐదుగురుమంత్రులతో పాటు ఉమ్మడి నిజామాబాద్ ముఖ్య నేతలంతా హాజరుకాగా, ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేవుడి పేరు చెప్పి ఓట్లు అడిగే బిచ్చగాళ్ళు బీజేపీ నాయకులు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల వర్షాలకు కామారెడ్డి ప్రాంతం ఇబ్బంది పడిందని, తాను టీపీసీసీ అధ్యక్షునిగా ఎన్నికై ఈ నెల 15 తో ఏడాది పూర్తవుతుందన్నారు. బీసీల సంక్షేమం కోసం రాష్ట్రంలో కుల సర్వే చేసిన నాయకుడు రేవంత్ రెడ్డి అని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కామారెడ్డి గడ్డమీద కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన డిక్లరేషన్ అన్నారు. రేవంత్ రెడ్డి బిసి వర్గానికి చెందకున్నా బీసీల సంక్షేమం కోసం డిక్లరేషన్ చేసి కేంద్రం పంపడం జరిగిందని, 42 శాతం రిజర్వేషన్ జరగకుండా బీజేపీ చూస్తుందన్నారు.

మిగతా 2లో

కనీవినీ ఎరుగని రీతిలో కామారెడ్డిలో బీసీ సభ

- దేశ చరిత్రలోనే సామాజిక న్యాయానికి శ్రీకారం చుట్టాం
- బీసీ సన్నాహక సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

02

## జిల్లాలకు కేటీఆర్


### కారు స్పీడ్ పెంచేందుకు ప్లాన్

దసరా లోపు.. ఎక్కువ నియోజకవర్గాలు చుట్టే ప్లాన్

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లాల పర్యటనలకు రెడీ అవుతున్నారు. కేసీఆర్ ఆదేశాలమేరకు ఇప్పటికే రూట్ మ్యాప్ రెడీ చేసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ బలోపేతంపై ఫోకస్ పెట్టాలని ఈ సందర్భంగా కేటీఆర్‌కు కేసీఆర్ సూచించినట్టు తెలుస్తోంది.

మిగతా 2లో





ధైర్యంగా అమెరికాపై

## 75% సుంకాలు వేయండి

### మోదీకి కేజ్రీవాల్ సవాల్

**మహా:** అమెరికా దిగుమతులపై ధైర్యంగా 75 శాతం సుంకం విధించాలని ప్రధాని మంత్రి నరేంద్ర మోదీని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సవాల్ విసిరారు. ట్రంప్ విధించిన 50 శాతం

మిగతా 2లో




బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,08,490 |
| 22 క్యారెట్ | 99,450 |
| సిల్వర్ (కేజీ) | 1,28,000 |

## దేశ హితం కోసం ఓటు వేయాలి

- ఎంపీలు ఏ నిర్ణయం తీసుకున్నా దానిని స్వీకరిస్తా
- అందరం కలిసి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం
- ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి కీలక రిక్వెస్ట్

**ఢిల్లీ, మహా:** ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి ఆదివారం ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఈ ఎన్నికల్లో దేశ హితం కోసం ఓటు వేయాలని ఎంపీలకు ఆయన పిలుపునిచ్చారు.

మిగతా 3లో



చంద్ర గ్రహణం ఎఫెక్ట్

ఆలయాలు మూసివేత

వివరాలు 2లో

బిగ్ బాస్ 9.. ఆట షురూ

హౌజ్ లోకి లక్స్ పాప, సంజన, రీతూ ఫోక్ సింగర్ రాము రాథోడ్, సుమన్ శెట్టి

వివరాలు 3లో

ఓవైసీకి థాంక్స్ చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి

03



# బీజేపీ నాయకులు బిచ్చగాళ్ళు

## దేవుడి పేరు చెప్పకుండా ఓట్లు అడగలేరు

టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సంచలన కామెంట్స్

బీజేపీ నాయకుల బట్టలూడదీసేందుకే.. కాంగ్రెస్ కామారెడ్డి సభ

బండి సంజయ్ నీకు దమ్ముంటే సెక్యూరిటీ వదిలేసి తిరుగు


రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రంలో బిఆర్ ఎస్ పార్టీ ఉండదు

(మొదటిపేజీ తరువాయి)

మీ బాగోతం ప్రజల ముందు పెట్టడానికే లక్షలాది మందితో కామారెడ్డి జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభ జరుపబోతున్నామని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం మూడు బిల్లులు చేసి కేంద్రానికి పంపామన్నారు.

**బండి దేశ్ ముఖ్**

మున్నూరు కాపు బిడ్డ అని చెప్పుకునే బండి సంజయ్ ఓ దేశ్ ముఖ్ లాగా వ్యవహరిస్తున్నారని, బండి సంజయ్ కు దమ్ముంటే నీకు ఉన్న సెక్యూరిటీ ను వదిలేసి తిరుగు నేను కూడా సెక్యూరిటీ లేకుండా తిరుగుతా అంటూ పీసీసీ చీఫ్ సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల్లో భారత దేశ ప్రధాని రాహుల్ గాంధీ అని, బండి సంజయ్, ధర్మపురి అరవింద్ లు బిసి ల గురించి మాట్లాడటం లేదన్నారు. బండి సంజయ్ నీకు బిసి చిత్త శుద్ధి ఉంటే, బిసి లపై ప్రేమ ఉంటే బిసి రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వండి.. బీజేపీ నాయకుల బట్టలు ఊడదీసేందుకే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కామారెడ్డిలో 15 న బిసి సభ నిర్వహించబోతున్నాం.. కామారెడ్డి విజయోత్సవ సభ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై సమర శంఖారావం పూరించబోతున్నామన్నారు. అన్ని కులాలను, అన్ని మతాలను సమానంగా చూసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. జిల్లా బిడ్డగా కవితను ఆదరిస్తాం కానీ లిక్కర్ రాణిగా ఒప్పుకోమన్నారు. బిఆర్ఎస్ పార్టీలో వాటాల విషయంలో తేడాలు రావడంతో కవిత బయట పెట్టిందని, కవిత ఈ విషయాలు ఐదేళ్ల క్రితం చెప్పుంటే



ప్రజలు నమ్మే వారని, ఇప్పుడు నమ్మే పరిస్థితి లేదన్నారు. బిఆర్ఎస్ దొంగల ముఠా అని, దేశంలో అత్యంత తక్కువ కాలంలో అత్యంత ఎక్కువ దోచుకున్న పార్టీ బిఆర్ ఎస్ అన్నారు. రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రంలో బిఆర్ ఎస్ పార్టీ ఉండదని తాను ఎన్నికల సమయంలోనే చెప్పానని, అదే జరుగుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరూ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. షబ్బీర్ అలీ అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు, నేతలు పాల్గొన్నారు.

## బీజేపీతో సావాసం మంచిది కాదు

**కేసీఆర్‌కు సీపీఐ నారాయణ సూచన**

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబంపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని కల్వకుంట్ల కవిత మాటలతో తేలిందని అన్నారు. ప్రజాధనంతో కట్టిన కాళేశ్వరంపై తప్పకుండా సమగ్ర విచారణ జరగాలని అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో లబ్ధి కోసం ప్రాంతీయ పార్టీలతో బీజేపీ పొత్తులు పెట్టుకుంటూ.. కుటుంబాలకు కుటుంబాలను చీల్చుతోందని ఆరోపించారు. జమ్మూకశ్మీర్, తమిళనాడు, మహారాష్ట్రలోనూ ఈ విధంగా బీజేపీ కుటుంబాలను చీల్చుకుంటూ వస్తోందని అన్నారు. లిక్కర్ కేసు అంటూ కల్వకుంట్ల కవితను జైల్లో పెట్టారు.. చివరకు కవిత కుటుంబం నుంచి విడిపోయి సొంత పార్టీ పెట్టుకునేంత వరకు వచ్చిందని అన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వలేదంటే బీజేపీబీఆర్ఎస్ మధ్య ఒప్పందం ఉన్నట్లే అని చెప్పారు. బీజేపీతో సావాసం మంచిది కాదన్నారు.

## ధైర్యంగా అమెరికాపై 75% సుంకాలు వేయండి

**మోదీకి కేజ్రీవాల్ సవాల్**

(మొదటిపేజీ తరువాయి)

సుంకాలకు ప్రతిస్పందనగా చర్యలు తీసుకోవాలని కోరారు. డిసెంబర్ 31వ తేదీ వరకు అమెరికా నుంచి పత్తి దిగుమతులపై 11 aశాతం సుంకాన్ని మినహాయించాలన్న కేంద్రం నిర్ణయం భారత పత్తి రైతులను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. ఇది అమెరికా రైతులను ధనవంతులుగా, గుజరాత్ సాగుదారులను పేదలుగా మారుస్తుందని ఆయన అన్నారు. "ప్రధాని ధైర్యం చూపించాలని మేం కోరుతున్నాం. దేశం మొత్తం మీ వెనుక ఉంది. భారతదేశం నుంచి వచ్చే ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకం విధించింది. మీరు అమెరికా నుంచి వచ్చే దిగుమతులపై 75 శాతం సుంకం విధించండి. దేశం దానిని భరించడానికి సిద్ధంగా ఉంది. దానిని విధించండి. అప్పుడు ట్రంప్ తలొగ్గుతుందో లేదో చూడండి" అని కేజ్రీవాల్ అన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనోత్సవాలు

**హర్షం వ్యక్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి**

అధికార యంత్రాంగాన్ని అభినందించిన ముఖ్యమంత్రి

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా ముగియడంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారు హర్షం వ్యక్తం చేశారు. తొమ్మిది రోజులపాటు భక్తులు గణ నాథుడికి భక్తి శ్రద్ధలతో పూజలుచేసి ఘన వీడ్కోలు పలికారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తొమ్మిది రోజులపాటు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, అత్యంత భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర ప్రశాంతంగా సాగడంలో అహర్నిశలు పనిచేసిన పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, రవాణా, పంచాయతీ రాజ్ ఇతర శాఖల అధికారులు, సిబ్బందికి, ఉత్సవ కమిటీల సభ్యులు, మండపాల నిర్వాహకులు, క్రేన్ ఆపరేటర్లు అందరికీ ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. హైదరాబాద్ నగరంలో లక్షలాది విగ్రహాలు క్రమపద్ధతిలో నిర్దేశిత సమయానికి ట్యాంక్‌బండ్‌తో సహా మిగతా అన్ని ప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమం సాఫీగా, ప్రశాంతంగా సాగడానికి సహకరించిన ప్రజలందరికీ ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు.

**ఈసారి పెద్ద విగ్రహాల సంఖ్య పెరిగింది : సీపీ ఆనంద్**

గణేశ్ నిమజ్జనోత్సవం ప్రశాంత వాతావరణంలో కొనసాగడం పట్ల హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ ఆనందం వ్యక్తం చేశారు. నిమజ్జనానికి కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికి సీపీ ఆనంద్ అభినందనలు తెలియజేశారు. నిమజ్జన కార్యక్రమానికి ఆధునిక సాంకేతికను ఉపయోగించామని, వినాయక నిమజ్జన కార్యక్రమంలో 9 డ్రోన్లను ఉపయోగించామని వివరించారు. 35 హై రైజ్ బిల్డింగ్స్‌పైన కెమెరాలు పెట్టి మానిటరింగ్ చేశామన్నారు. 12,034 విగ్రహాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని, 6,300 విగ్రహాలు శనివారం వరకు నిమజ్జనం అయ్యాయని, ఇవి కాకుండా 1.20 లక్షల విగ్రహాలు బేబీ పాండ్స్, ఇతర చెరువుల్లో నిమజ్జనం అయ్యాయని, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 1.40 లక్షల విగ్రహాలు నిమజ్జనం అయ్యాయని తెలిపారు. ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ సమితి సమన్వయంతో టైమ్ కంటే ముందే నిమజ్జనం అయ్యాయని, సున్నిత ప్రాంతమైన సౌత్ జోన్ విగ్రహాలను ముందు తీయించామని, 40 అడుగుల కన్నా ఎత్తు ఉన్న విగ్రహాలు ఈసారి పెరిగాయని, విగ్రహాల ఎత్తు పెరగడంతో శోభాయాత్ర ఆలస్యమైందని అన్నారు.

### పెద్ద విగ్రహాల సంఖ్య పెరిగింది

**శనివారం రాత్రి శోభాయాత్రలో జరిగిన గొడవల్లో 5 కేసులు నమోదు చేశామని, సీఎం రేవంత్ రెడ్డి సర్‌ప్రైజ్ విజిట్ చేయడం మంచిదేనని, ఎలాంటి సమస్య రాలేదని అన్నారు. అన్ని శాఖల సమన్వయంతో నిమజ్జన కార్యక్రమం విజయవంతమైందని, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన 1,070 మందిని పట్టుకున్నామని, పిక్ పాకెటింగ్ కేసులు కూడా నమోదు చేశామని పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి క్రైమ్ రేట్ తగ్గిందని వివరించారు. రెండు రోజులు నిద్ర లేకుండా కష్టపడి పని చేశామని, మండపం నిర్వాహకులు చాలా ఆలస్యంగా విగ్రహాలను తీశారన్నారు.**


## పార్టీ మారిన ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ కీలక సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

అయితే.. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు ఎమ్మెల్యేలు తాము బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నామంటూ.. పలు సందర్భాల్లో ప్రకటించారు. శాసనసభ రికార్డుల్లోనూ పది మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే ఉన్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే.. సుప్రీంకోర్టు నిర్దేశించిన గడువు లోపల పది మంది ఎమ్మెల్యేలపై విచారణ పూర్తి చేసి స్పీకర్ నిర్ణయం ప్రకటిస్తారా..? లేక పెండింగ్‌లో పెడతారా..? అన్నది చర్చనీయాంశంగా మారింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల్లో కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), దానం నాగేందర్ (ఖైరతాబాద్), తెల్లం వెంకట్రావ్ (భద్రాచలం), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల), అరెకపుడి గాంధీ (శేరిలింగంపల్లి), పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ) గూడెం మహిపాల్‌రెడ్డి (పఠాన్ చెరు) సంజయ్ కుమార్ (జగిత్యాల), కాలె యాదయ్య (చేవేళ్ల), ప్రకాశ్‌గౌడ్ (రాజేంద్రనగర్) ఉన్నారు. వీరిలో ఒకరిద్దరు ఎమ్మెల్యేలు స్పీకర్‌కు ఇప్పటికే వివరణ ఇచ్చారు. మిలిగిన వారు స్పీకర్ నోటీసులపై స్పందించలేదు.

**రాజీనామాకు సై**

కాగా మిగతా ఎమ్మెల్యేలకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కు భిన్నమైన పరిస్థితి ఉండడంతో దీనిని ప్రత్యేక అంశంగా చూడాలని, సరైన వ్యూహంతో ముందుకెళ్ళాలని నిర్ణయించారు. దానం నాగేందర్ రాజీనామాకు కూడా సిద్ధంగా ఉన్నట్లు చెబుతుండగా, దీనిపై హాట్ హాట్ చర్చ జరిగింది. తనకు జూబ్లిహిల్స్ టికెట్ ఇవ్వాలని, జూబ్లిహిల్స్ లో గెలవడంతో పాటు ఖైరతాబాద్ లోనూ కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తానని దానం సీఎం ముందు ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే దీనిపై పార్టీ ముఖ్యులందరితో చర్చించి నిర్ణయం తీసుకుందామని, ప్రయోగాలకు ఇది సమయం కాదని చెప్పినట్లు తెలుస్తోంది.



## మూసీ ముందుకు

**హైదరాబాద్‌కు గోదావరి జలాలు**

జంట జలాశయాలు నింపే పథకానికి నేడు సీఎం రేవంత్ శంఖుస్థాపన

2027 డిసెంబర్ నాటికి హైదరాబాద్ తాగునీటి అవసరాలు తీర్చేలా ప్లాన్

(మొదటిపేజీ తరువాయి)

అందులో ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలు నింపి మూసీ పునరుజ్జీవనానికి 2.5 టీఎంసీలు కేటాయిస్తారు. మిగతా 17.50 టీఎంసీలు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు వినియోగిస్తారు. మార్గమధ్యలో ఉన్న 7 చెర్వులను నింపుతారు. డిసెంబర్ 2027 నాటికి హైదరాబాద్ తాగునీటి అవసరాలు తీర్చేందుకు, ప్రతి రోజు నల్లా నీటిని సరఫరా చేసేందుకు ఈ ప్రాజెక్టును లక్ష్యంగా ఎంచుకున్నారు.

**తాగునీటికి భరోసా**

ఓఆర్ఆర్ - ఫేజ్ 2 లోభాగంగా జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, గ్రామ పంచాయితీలకు తాగునీటి సరఫరా చేపట్టిన ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. రూ.1200 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా 71 రిజర్వాయర్లు నిర్మించారు. వీటిలో కొత్తగా ఇటీవల నిర్మించిన 15 రిజర్వాయర్లను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. సరూర్ నగర్, మహేశ్వరం, శంషాబాద్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఘట్‌కేసర్, కీసర, రాజేంద్రనగర్, షామీర్‌పేట్, మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఆర్‌సీ పూరం, పటాన్‌చెరు, బొలారం.. మొత్తం 14 మండలాల్లోని 25 లక్షల మందికి తాగునీరు అందుతుంది.

**కోకాపేటలో రూ.298 కోట్లతో ప్రాజెక్టు**

కోకాపేట్ లేఅవుట్ సమగ్ర అభివృద్ధి - నియో పోలీస్ సెజ్ కు తాగునీటితో పాటు మురుగునీటి వ్యవస్థను అభివృద్ధి చేసే రూ.298 కోట్ల ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేస్తారు. రెండేండ్లలో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుతో 13 లక్షల మంది లబ్ధి పొందుతారు. ప్రధానంగా రానున్న రెండేళ్లలో హైదరాబాద్, ఓఆర్ఆర్ లోపలిప్రాంతాల్లో తాగునీటి సమస్య తీర్చడమే లక్ష్యంగా రూపొందిన ప్రణాళికను పట్టాలెక్కిస్తున్నారు. ఈ పథకం పూర్తయితే హైదరాబాద్ వాసుల నీటికష్టాలు గట్టెక్కుతాయి.

## జిల్లాలకు కేటీఆర్

(మొదటిపేజీ తరువాయి)

కవితను సస్పెండ్ చేయటంతో పార్టీ క్యాడర్‌లో నెలకొన్న గందరగోళానికి తెరదించాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్టు సమాచారం. , పార్టీ వీడిన ఎమ్మెల్యేల నియోజకవర్గాలను ముఖ్యంగా టార్గెట్ చేయాలని కేటీఆర్ భావిస్తున్నారు. వీటితోపాటు, స్థానిక సంస్థల ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కేటీఆర్ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈనెల 10న కొత్తగూడెం, 11న భద్రాచలం నియోజకవర్గాల్లో కేటీఆర్ టూర్ ఉండబోతున్నట్టు తెలుస్తోంది. 13న గద్వాల్ నియోజకవర్గంలో ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించాలని కేటీఆర్ భావిస్తున్నారు. దసరా లోపు వీలైనన్ని ఎక్కువ నియోజకవర్గాల్లో పర్యటించాలని కేటీఆర్ ప్లాన్ చేసుకుంటున్నారు.

## సిద్దిపేట మోడల్ చిలిపి లీలలు

**కవిత టీమ్ సంచలన ట్వీట్**

కవితక్క అప్ డేట్స్ తో వరుస కౌంటర్లు

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ బహిష్కృత నేత కవిత ఇటీవల మాజీ మంత్రి ఆ పార్టీ నేత హరీష్ రావుపై సంచలన ఆరోపణలు చేయగా కవిత టీమ్ ట్విట్టర్ ద్వారా నేతల లీలలు అంటూ పలు అంశాలను బయటపెడుతోంది. కవితక్క అప్ డేట్స్ ట్విట్టర్ ఎకౌంట్ ఇపుడు సంచలనంగా మారింది. ప్రతీరోజూ ఏ అంశాలు ట్విట్టర్ లో పెడతారని కొందరు గులాబీనేతలు ఆసక్తిగా చూస్తున్నారు. కవితపై జరిగే దుష్ప్రచారాన్ని ఈ అకౌంట్ వేదికగా గట్టిగా తిప్పికొట్టడంతో పాటు కొత్త విషయాలు చర్చకు పెడుతున్నారు. పార్టీలో జరిగిన కొన్ని విషయాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. కవితక్క అప్డేట్స్ అనే ట్విట్టర్ పేజీలో ఆదివారం మరో సంచలన ట్వీట్ చేసింది. సిద్దిపేట మోడల్ చిలిపి లీలలు అనే టైటిల్ ఎలా ఉందని పోస్టులో పేర్కొంది. రాజకీయం దిగజారి చేస్తున్నారు, మీరు దూరిన సందులు గొందుల గురించి మాట్లాడే పరిస్థితి తెచ్చుకోకండి అంటూ పోస్ట్ లో హెచ్చరించారు. కవితపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా కామెంట్లు, పోస్టులు పెడుతున్నవేళ ఈ పోస్ట్ సంచలనంగా మారింది.

## ఎమ్మెల్యే కసిరెడ్డిపై జనం భగ్గు

**కల్వకుర్తి ఎమ్మెల్యేకు బిగ్ షాక్**

ఎవరి లబ్ధి కోసం ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చారు

ఏకపక్ష నిర్ణయంతో చిన్న, సన్నకారు రైతులకు అన్యాయం

ఆగ్రహంతో ఆమనగల్లు హైవేపై రైతుల బైఠాయింపు.. నిరసన

ఎమ్మెల్యే కసిరెడ్డి దిష్టిబొమ్మ దహనం

ఆమనగల్లు, తలకొండపల్లి, మాడుగుల మండలాల రైతుల్లో అలజడి



(మొదటిపేజీ తరువాయి)

ఆదివారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో సంకటోనిపల్లి ,వెంకట్రావుపేట, గౌరిపల్లి,జంగారెడ్డిపల్లి, చంద్రధనకు చెందిన సుమారు 150 మంది రైతులు సన్నకారు రైతులకు నష్టం కలిగించేలా ట్రిపుల్ ఆర్ అలైన్మెంట్ ప్రభుత్వం మార్చిందని, పెద్దల భూములు కాపాడేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉన్న రెండు మూడు ఎకరాల భూమి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటే తమ పిల్లల భవిష్యత్తు ఏం కావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చావనైనా చస్తాం కానీ ట్రిపుల్ ఆర్ నిర్మాణానికి తమ భూములను ఇవ్వమని ముక్తకంఠంగా తెలిపారు. ఆర్ఆర్ఆర్ వల్ల మిగిలిన భూములు కూడా కోల్పోతే ఆ రైతులకు ఆత్మహత్యే శరణ్యమని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు.

**ఎమ్మెల్యే ప్రయోజనాలకోసమే మార్చారు**

ఎవరి లబ్ధి కోసం అలైన్మెంట్ మార్చారని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రయోజనాల కోసమే మారిందని ప్రజలు, రైతులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం ట్రిపుల్ ఆర్ అలైన్మెంట్ ను ఏకపక్షంగా ప్రకటించి రైతులను గందరగోళం లో పడేసిందని ఆరోపించారు. సరైన సర్వే నిర్వహించకుండా అలైన్మెంట్ పేరుతో సర్వే నంబర్లు ప్రకటించడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో ఉన్న అలైన్మెంటను ఎందుకు మార్చాల్సి వచ్చిందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేసి ఎమ్మెల్యే కసిరెడ్డి,ప్రభుత్వానికి వ్యతిరేకం గా నినాదాలు చేశారు.. నిరసన చేస్తున్న రైతులను పోలీసులు పోలీస్ స్టేషన్ కు తరలించారు. మొదట ఉన్న అలైన్ మెంట్ రైతులకు తక్కువ నష్టం జరిగేలా ఉందని, కొత్త అలైన్ మెంట్ వల్ల చాలా గ్రామాల ప్రజలు నష్టపోతున్నారని, ఎమ్మెల్యే భూముల పక్కగా పోతున్నదని రియల్ ప్రయోజనాల కోసం ఆమనగల్లు, తలకొండపల్లి, మాడుగుల మండలాల చిన్న,సన్నకారు రైతులకు అన్యాయం చేస్తున్నారంటూ ఆందోళన వ్యక్తం చేసిన రైతులు ఆరోపించారు.

**నేడు కూడా నిరసనలు**

కాగా సోమవారం కూడా రైతుల నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆదివారం ఆమనగల్లు హైవేపై నిరసన తెలిపిన రైతులు , సోమవారం తలకొండపల్లి మండల కేంద్రంలో నిరసన తెలపనున్నట్లు పేర్కొన్నారు. కొత్త అలైన్ మెంట్ రద్దుచేయాలని, పాత అలైన్ మెంటే కొనసాగించాలని రైతులు కోరుతున్నారు.

## కనీవినీ ఎరుగని రీతిలో కామారెడ్డిలో బీసీ సభ

దేశ చరిత్రలోనే సామాజిక న్యాయానికి శ్రీకారం చుట్టాం

బీసీ సన్నాహక సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**కామారెడ్డి, మహా:** ఈ నెల 15న కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ నిర్వహించబోతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనబోయే బీసీ బహిరంగ సభను కాంగ్రెస్ పార్టీ సైనికులు, కార్యకర్తలు కార్యోన్ముఖులై కనీవినీ ఎరుగని రీతిలో భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం బీసీ బహిరంగ సభ కోసం సభాస్థలిని పరిశీలించారు. అనంతరం టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, దనసరి సీతక్క, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, పార్లమెంట్ సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, కార్పొరేషన్ చైర్మన్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పాల్గొన్నారు.

**ప్రజలు గమనించి తిప్పి కొట్టాలి..**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో ప్రజా ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టామని స్పష్టం చేశారు. దేశ చరిత్రలోనే సామాజిక న్యాయానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం, చిత్తశుద్ధితో బీసీలకు 42



శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించడం జరిగిందని చెప్పారు. బీసీ రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవాలని ప్రతిపక్షాలు ఎన్నో కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. అడుగడుగునా అడ్డుకుంటున్నాయి. బీసీ వర్గాల ప్రజలు గమనించి తిప్పి కొట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కోరారు.

## జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా రాజీనామా

**పార్టీ అంతర్గత విబేధాలతో స్వస్తి చెబుతూ నిర్ణయం**

గతేడాది అక్టోబర్ నెలలో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఇషిబా

**ఇంటర్నెట్ డెస్క్, మహా:** జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీలో అంతర్గత విభేదాలకు స్వస్తి పలకాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జులైలో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో పార్టీ పరాజయానికి బాధ్యత వహించాలంటూ సొంత పార్టీ నేతల నుంచి ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో ఇషిబా నుంచి ఈ ప్రకటన వెలువడింది. గతేడాది ఫుమియో కిషిద రాజీనామా తర్వాత అధికార లిబరల్ డెమొక్రటిక్ పార్టీ (ఎల్డీపీ) అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన షిగెరు ఇషిబా.. అక్టోబర్‌లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అయితే, ఈ జులైలో జరిగిన ఎన్నికల్లో పార్లమెంట్ ఎగువ సభలో అధికార సంకీర్ణ ప్రభుత్వం మెజార్టీని సాధించలేకపోయింది. అంతకుముందు దిగువ సభలోనూ మెజార్టీ కోల్పోయింది. దీంతో స్వపక్ష సభ్యుల నుంచి ప్రధానిపై ఒత్తిడి పెరిగింది.



# ఓవైసీకి థాంక్స్ చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** ఉపరాష్ట్రపతి ఎన్నికల వేళ రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ఇండియా కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదివారం ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఫోన్ చేసి చేసిన విజ్ఞప్తి మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ పరిణామంపై సీఎం రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఒవైసీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. "జాతీయ ప్రయోజనాల దృష్ట్యా జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారికి మద్దతుగా ముందుకు వచ్చినందుకు అసదుద్దీన్ ఒవైసీ భాయ్‌కి ధన్యవాదాలు" అని రేవంత్ రెడ్డి తన పోస్టులో పేర్కొన్నారు.

# కార్మికుడిగా చేరి పక్కాగా ఆధారాలు!

## ల్యాబొరేటరీ డ్రగ్స్ కేసులో సినిమా రేంజ్ ట్విస్ట్

- తయారు చేసిన డ్రగ్స్‌ను హైదరాబాద్‌లో అమ్మిన విజయ్ ఓలేటి
- గ్యాంగ్‌గా ఏర్పాటు.. చర్లపల్లి డ్రగ్స్ కేసులో కీలక విషయాలు



**హైదరాబాద్, మహా:** చర్లపల్లి డ్రగ్స్ కేసులో కీలక అంశాలు వెలుగు చూస్తున్నాయి. వాగ్దేవీ ల్యాబొరేటరీస్‌పై ఆకస్మిక దాడులు చేయగా.. డ్రగ్స్ తయారీ యూనిట్ బయటపడిన విషయం తెలిసిందే. ఈ సంస్థ యజమాని గతంలోనూ పోలీసులకు పట్టుబడినట్లు దర్యాప్తులో తేలింది. అయితే తన పలుకుబడిని ఉపయోగించుకుని డ్రగ్స్ కేసులో అరెస్టు కాకుండా చూసుకున్నాడు. కాగా ముంబయిలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న బంగ్లాదేశీ మహిళను అరెస్టు చేశారు. ఆపై ఆమెను దర్యాప్తు చేస్తుండగా హైదరాబాద్‌లోని ల్యాబొరేటరీలో డ్రగ్స్ తయారీ యూనిట్ ఉందనే విషయం బయటపడింది. ఈ నేపథ్యంలో ముంబయి నార్కోటిక్ పోలీసులు వాగ్దేవీ ల్యాబొరేటరీస్‌పై ఓ కన్నేశారు. ముంబయి పోలీసుల్లో ఒకరు కార్మికుడిగా ఈ ల్యాబొరేటరీలో ఉద్యోగిగా చేరారు. అయితే పోలీసుల పథకంలో భాగంగా నెల రోజుల పాటు ల్యాబోరేటరీలో పని చేసి పక్కాగా ఆధారాలు సేకరించారు. అనంతరం శనివారం పోలీసులు దాడి చేసి రూ.కోట్లు విలువ చేసే డ్రగ్స్, ఎండీ డ్రగ్స్ తయారీకి వినియోగించే 35,500 లీటర్ల ముడి సరుకును స్వాధీనం చేసుకున్నారు. 5.79 కిలోల మెఫిడ్రోన్, 950 కిలోల పొడి పదార్థం, మిథైలెనెడియాక్సీ మెథాంఫెటమైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇంకా ఈ కేసులో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# చంద్ర గ్రహణం ఎఫెక్ట్

## ఆలయాలు మూసివేత

**హైదరాబాద్, మహా:** సంపూర్ణ చంద్ర గ్రహణం కారణంగా ఆదివారం తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన పలు దేవాలయాలను మూసివేశారు. ఆదివారం రాత్రి 9.58 గంటల నుంచి చంద్రగ్రహణం ప్రారంభం కానుంది. రాత్రి 11 గంటల నుంచి అర్ధరాత్రి 12.22 గంటల దాకా సంపూర్ణ చంద్ర గ్రహణం ఏర్పడనుంది. ఈ 82 నిమిషాల పాటు చంద్రుడు పూర్తిగా భూమి నీడన ఉండనున్నాడు.తిరిగి సోమవారం తెల్లవారుజామున 2.25 గంటలకు గ్రహణం వీడనుంది. ఈ నేపథ్యంలో పలు ప్రముఖ ఆలయాలు మూతపడ్డాయి. గ్రహణం వీడిన తర్వాత ఆలయాలను తెరిచి సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు మూసివేశారు. ఈ మూసివేత సోమవారం తెల్లవారుజామున 3 గంటల వరకు కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచి శుద్ధి చేసిన తర్వాత 3 గంటలకు సుప్రభాతంతో దర్శనాలు ప్రారంభిస్తామని చెప్పారు. అలాగే.. శ్రీశైలం ఆలయాన్ని మధ్యాహ్నం ఒంటి గంటకు మూసివేసి సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు తెరవనున్నారు. సోమవారం ఉదయం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ పూజలు చేసిన అనంతరం ఉదయం 7.30 గంటల నుంచి భక్తులను దర్శనాలకు అనుమతిస్తామని అధికారులు తెలిపారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయాన్నీ ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి దుర్గగుడి కవాట బంధనంతో మూసివేశారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు ఆలయ ద్వారాలను తెరిచి సంప్రోక్షణ, స్నపనాభిషేకం చేపట్టనున్నారు. అమ్మవారికి హారతి అనంతరం సోమవారం ఉదయం 8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతించనున్నట్టుగా అధికారులు తెలిపారు. విశాఖపట్నంలోని సింహాచలం అప్పన్న ఆలయాన్ని కూడా ఉదయం 11:30 గంటలకు మూసివేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం రామాలయాన్ని సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం ఒంటి గంటకు మూసివేసినట్లు అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం తెరవనున్నారు.

# బిగ్ బాస్ 9 ఆట షురూ

## హౌజ్ లోకి లక్స్ పాప, సంజన, రీతూ ఫోక్ సింగర్ రాము రాథోడ్, సుమన్ శెట్టి

**హైదరాబాద్, మహా:** తెలుగు టెలివిజన్ ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న రియాలిటీ షో బిగ్ బాస్ కొత్త సీజన్ అట్టహాసంగా ప్రారంభమైంది. 'ఈసారి చదరంగం కాదు, రణరంగమే' అనే సరికొత్త నినాదంతో కింగ్ నాగార్జున హోస్ట్‌గా సీజన్ 9కి స్వాగతం పలికారు. గ్రాండ్ లాంచ్ ఎపిసోడ్‌లో భాగంగా, తొలి కంటెస్టెంట్లుగా బుల్లితెర నటి తనూజ, ఒకప్పటి 'లక్స్ పాప'గా పేరుగాంచిన నటి ఆశా సైనీ బిగ్ బాస్ హౌస్‌లోకి అడుగుపెట్టారు. విజయనగరం నుంచి వచ్చిన సోల్జర్ పడాల కల్యాణ్, జబర్దస్త్ కమెడియన్ ఇమ్మాన్యుయెల్, ఫేమస్ కొరియోగ్రాఫర్ శ్రేష్టి వర్మ, మాస్క్ మ్యాన్ హరీష్, సీరియల్ యాక్టర్ భరణి, టీవీ యాక్టర్ రీతూ చౌదరి, కామనర్ డీమాన్ పవన్, బుజ్జిగాడు' ఫేం సంజనా గల్రానీ, ఫోక్ డ్యాన్సర్, 'రాను ముంబయికి రాను' ఫేం రాము రాథోడ్, దమ్ము శ్రీజ, సుమన్ శెట్టి, శ్రేయ, కామనర్ మర్యాద మనీష్ హౌజ్ లోకి ప్రవేశించారు. మొత్తం 15మంది హౌజ్ లోకి రాగా, ఈసారి వైల్డ్ కార్డ్ ఎంట్రీతో మరో ఐదుగురు ఎంటర్ అయ్యే అవకాశం ఉంది.



# గురుకులాలంటే ఎందుకంత చిన్నచూపు?

## గాడితప్పిన గురుకుల విద్యా వ్యవస్థపై శ్రద్ధ వహించాలి

### ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి రెండు నెలల నుంచి జీతాలు ఇవ్వని దుస్థితి ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం

**హైదరాబాద్, మహా:** గురుకులాలంటే ఎందుకు మీకు అంత చిన్న చూపు అని సీఎం రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు నిలదీశారు. ఇప్పటికైనా కళ్ళు తెరిచి గాడి తప్పిన గురుకుల విద్యా వ్యవస్థపై శ్రద్ధ వహించాలని సూచించారు. తక్షణమే గురుకులాల సమస్యలను పరిష్కరించాలన్నారు. 2500 మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి పెండింగ్ జీతాలను చెల్లించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. విష జ్వరాలు, పాముకాట్లు, ఎలుక కాట్లు, కుక్కకాట్లు, ఫుడ్ పాయిజనింగ్‌తో విద్యార్థులు ఆస్పత్రుల పాలై ప్రాణాలు కోల్పోయే పరిస్థితి దాపురించిందని విమర్శించారు.


### రేవంత్ పాలనలో నరక కూపాలుగా మారాయి..

గురుకులాల్లో పనిచేస్తున్న 2500 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి రెండు నెలల నుంచి జీతాలు ఇవ్వని దుస్థితి అని హరీశ్‌రావు విమర్శించారు. ఉపాధ్యాయుల దినోత్సవం నాడు ఆడంబరంగా ప్రకటనలు చేయడం కాదు ముందు వారికి సకాలంలో జీతాలు చెల్లించమని సీఎం రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా నేనే ఇకనుంచి గురుకులాలను పర్యవేక్షిస్తానని చెప్పిన మాటలు నీటి మూటలు అయ్యాయని విమర్శించారు. కల్తీ ఆహారం పెడితే జైలుకే అని ఇచ్చిన ప్రకటనలు గాలి మాటలయ్యాయయని అన్నారు. కేసీఆర్ హయాంలో గురుకుల విద్యా వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిస్తే రేవంత్ రెడ్డి పాలనలో నరక కూపాలుగా మారాయని హరీశ్‌రావు విమర్శించారు. నాడు 294గా ఉన్న గురుకులాల సంఖ్యను 1024 కి పెంచిన ఘనత కేసీఆర్‌ది అని కొనియాడారు.

# ఓట్ల చోరీకి పాల్పడుతున్న వారిని కాపాడటమే ఈసీ లక్ష్యం

## పదేళ్లుగా ఎన్నికల సంఘంపై అదే చేస్తుంది

- అందుకు చట్టాలను మార్చడానికి కూడా వెనకాడట్లేదు
- ఈసీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శలు



**ఢిల్లీ, మహా:** భారత ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. పదేళ్లుగా ఈసీ ఓట్ల చోరులను కాపాడుతూ వస్తోందని, కీలక సమాచారాన్ని దాచి పెట్టిందని ఆరోపించారు. 2023లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటరు జాబితా నుంచి ఓట్లను తొలగించడానికి చేసిన యత్నానికి సంబంధించిన కీలక డేటాను ఇప్పటికీ ఎన్నికల సంఘం బయటపెట్టలేదన్నారు.

### వారిని ఈసీ సమర్థంగా రక్షించింది..

మే 2023 కర్ణాటక ఎన్నికలకు ముందు అలంద్ నియోజకవర్గంలో ఓటర్లను తొలగించాలని చేసిన ప్రయత్నాలను తమ పార్టీ బయట పెట్టిందని ఖర్గే చెప్పారు. అప్పట్లో దీనివల్ల వేలమంది ఓటర్లు తమ ఓటు హక్కులు కోల్పోయారన్నారు. ఓటర్లను మోసం చేయడానికి జరిగిన భారీ ప్రయత్నానికి స్పష్టమైన సాక్ష్యాలు ఉన్నప్పటికీ కీలక విషయాలను దాచిపెట్టి, ఓట్ల చోరీ వెనక ఉన్న వారిని ఈసీ సమర్థంగా రక్షించిందన్నారు. ఓట్ల చోరీకి పాల్పడుతున్న వారిని కాపాడటమే లక్ష్యంగా ఈసీ పదేళ్లుగా పని చేస్తోందని ఖర్గే చెప్పారు. అందుకు చట్టాలను మార్చడానికి కూడా వెనకాడట్లేదని విమర్శించారు. నాడు కర్ణాటకలో చేసిన విధంగా ప్రస్తుతం బీహార్‌లోనూ ఓట్ల చోరీకి పాల్పడేందుకు కేంద్రం, ఈసీ కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. ఓట్ల చోరీ ద్వారా గెలిచేందుకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు.

# ప్రపంచం చూపు విజయవాడ ఉత్సవ్ వైపు

## కర్టెన్ రైజర్ ప్రారంభించిన సంయుక్త మీనన్ మైసూర్ దసరాను మరిపించేలా ప్లాన్



**విజయవాడ, మహా:** దసరా సందర్భంగా విజయవాడ ఉత్సవ్ పేరుతో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 వరకు విజయవాడ నగరంలో పెద్దఎత్తున వేడుకలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. పర్యాటకానికి జవసత్వాలు అందించేలా.. ఈ వేడుకలను నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇక 'విజయవాడ ఉత్సవ్' పేరుతో కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంకు హీరోయిన్ సంయుక్త మీనన్ హాజరయ్యారు. 'విజయవాడ అందమైన సిటీ. విరూపాక్ష సినిమా రిలీజ్ ముందు అమ్మవారి దర్శనం చేసుకున్నాను. విజయవాడ ఉత్సవ్ ఒక విజన్‌తో చేస్తున్నారు. ప్రజలందరి మద్దతుతోనే విజయవాడ ఉత్సవ్ సక్సెస్ అవుతుంది. సెప్టెంబరు 22 నుంచి అక్టోబర్ 2 వరకూ జరిగే విజయవాడ ఉత్సవ్‌లో చాలా కార్యక్రమాలు జరుగుతాయి. పర్యాటకాన్ని ప్రొమోట్ చేస్తూ.. ప్రపంచం విజయవాడ వైపు చూడాలని ఈ ఉత్సవ్ నిర్వహిస్తున్నారు' అని సంయుక్త చెప్పారు. మైసూర్ దసరాను మరిపించేలా ఈసారి ఏపీ సర్కార్ గట్టి ప్లాన్ చేసింది.

# దేశ హితం కోసం ఓటు వేయాలి



(మొదటిపేజీ తరువాయి)

ఎంపీలు ఏ నిర్ణయం తీసుకున్నా.. దానిని స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ఈ ఎన్నికను కేవలం ఉప రాష్ట్రపతి ఎన్నికగా చూడొద్దని ఓటు హక్కు వినియోగించుకునే ఎంపీలకు ఆయన సూచించారు. ఇది దేశం కోసం జరిగే ఎన్నికగా భావించాలని వారికి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి వివరించారు. భారత్ ఆత్మ కోసం జరిగే ఎన్నికలుగా వీటిని భావించాలని.. అందరం కలిసి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దామంటూ ఎంపీలకు ఆయన కీలక సూచన చేశారు.


మీరు జర్నలిస్ట్ అవ్వాలనుకుంటున్నారా?
జర్నలిజంలో రాణించి సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను అరికట్టాలనుకుంటున్నారా? అయితే మీకిదే సువర్ణావకాశం
ANN SCHOOL OF JOURNALISMలో
జాయిన్ అయ్యి నిజమైన జర్నలిస్టులుగా గుర్తింపు తెచ్చుకోండి.
గృహిణులు, నిరుద్యోగులు, విద్యార్థులకు
ఇదే మా ఆహ్వానం
అడ్మిషన్లు ప్రారంభమైనవి
అప్లికేషన్‌కు ఆఖరుతేదీ - సెప్టెంబర్ 12
తరగతులు ప్రారంభం : సెప్టెంబర్ 22
పరిమితమైన సీట్లు, సీనియర్ పాత్రికేయులతో విద్యాబోధన
మీరున్న చోటు నుండే ఆన్‌లైన్‌లో జర్నలిజం క్లాసులు
8 వారాలు, 16 ఆన్‌లైన్ క్లాసులు
కోర్సు పూర్తైన విద్యార్థులకు జర్నలిజం సర్టిఫికెట్ ఇవ్వబడును
మెరిట్ స్టూడెంట్స్ కు ఇంటర్న్‌షిప్ అవకాశం.. రికమండేషన్ లెటర్
HURRY UP! త్వరపడండి...
FOR ADMISSIONS CONTACT: +91 74369 39999
SCAN ME
APPLY ON OUR OFFICIAL WEBSITE: WWW.ANNSCHOOLOFJOURNALISM.COM

ఉద్యోగావకాశం
పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న
మహా పత్రికకు
(RNI NO: APTEL/2003/09316)
ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
WWW.EPAPER.MAHAADAILY.COM
ఆసక్తి గల వారు సంప్రదించండి
MAHAAPATRIKA@GMAIL.COM,
95501 59679, 90001 41919

mahaa తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ | 08-09-2025



# స్వేద దరహాసం



స్వేదం అంటని పద్యాలకు
పాదాలుండవు రెక్కలు తప్ప!

మట్టి అంటని పాదాల నుండి
శ్రమ సౌందర్యాన్ని కలగనలేము!

మట్టికి మహిమలద్దిన పాదాల పవిత్రత
రెక్కల పద్యాలు దర్శించ లేవు!

మట్టి పాదాలు స్వేదం చిందని రోజు
ఉదయాస్తమయాలు ఉనికిని కోల్పోతాయి!

రోజూ ఎన్ని అనుభవాలు వైభవాలు
అన్నింటికీ మూలం శ్రామికుని స్వేద బిందువే!
మార్కెట్ వెల్లువలో కొట్టుకపోయే మనిషికి
కార్మికుని త్యాగశీలతను మన పద్యమే విప్పాలి!

లోకానికి ప్రాణం పోసే శ్రామికుని నిత్య సేవకు
హారతి పట్టిన చోటనే మానవత్వానికి
చిరునామా!

మనిషి ఊహలను ఒకసారి ఒడగట్టి చూడండి
ఆ పరిమళమంతా
శ్రామికుని స్వేద దరహాసమే!!


- కోట్ల వెంకటేశ్వర రెడ్డి,
9440233261

# మైత్రీసూత్రం

నువ్వు ఎగరేసిన పిట్టలు వెండిమేఘాలుగా మారి వెలుగును చిమ్ముతూ కమ్ముకుంటాయి నన్ను. పరాయిసీమల వాతావరణాన్ని పరిమళద్రవ్యంగా పూసుకున్న అవి మన మస్తిష్కాలను కలిపే వారధులు. నీ ఇంటలెక్చువల్ వృత్తపరిధిలోకి ప్రవేశించాక కౌశలప్రకాశం అంటుకొని నేనూ నీలాగా కాంతిని విరజిమ్మే ఒక మిణుగురునౌతానని ఆశ. మనమిద్దరం ఒకే వెల్తురుకొమ్మకు పూసిన పువ్వులం బహుశా. కొత్తదారిని సుగమం చేసుకుంటున్న నీ నడకను ఎంత చూసినా తనివి తీరదు. నువ్వు ఏలబోయే కీర్తిసామ్రాజ్యాలు నా కళ్లముందు మెదిలి నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నై. ఈ ముందస్తు సూచన ఎన్ని తేజోవలయాలకు రాకకు చిహ్నమో తెలుసుకో.

**(String of Amity అనే నా ఆంగ్లకవితకు స్వీయానువాదం)**

- ఎలనాగ, 9866945424




## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ
దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

## ఆదిలాబాద్ జిల్లా ఆది అచల గురువు


# ఉదారి నాగదాసు

అచల బోధ పరంపర తెలంగాణలో ప్రారంభమయింది. దీనికి ఆద్యులు నల్లగొండ జిల్లా నారాయణపేట సంస్థానానికి చెందిన రామడుగు శివరామదీక్షితులు (16901791). ఈయన శిష్యులు అచలబోధను దేశమంతటా ప్రచారంలో పెట్టారు. బ్రహ్మం ఒకటే నిజమని మిగతాదంతా దాని రూపమని అచలం చెబుతుంది. అచలం అంటేనే చలనం లేనిది. స్థిరమైన, మార్పులేని పరబ్రహ్మ స్థితిని సూచిస్తుంది. గురుశిష్య సంబంధం ద్వారా ఆత్మజ్ఞానాన్ని అందించే అద్వైత సిద్ధాంతమిది. కుల, మతాలకు అతీతంగా ఈ తత్వం దక్షిణ భారతదేశంలో, మహారాష్ట్రలోనూ విస్తృత ప్రచారం పొందింది. దళితుడైన అచల గురువు దున్న ఇద్దాసుకు రెడ్లు, బ్రాహ్మణులు శిష్యులుగా ఉన్నారు. ఈ పరంపరలోని వాడే హైదరాబాద్/ఆంధ్రప్రదేశ్‌లలో మంత్రిగా పనిచేసిన అరిగె రామస్వామి. ఈ తత్వబోధకులు సన్యాసం స్వీకరించలేదు. దేశాటన చేయలేదు. వృత్తులు, ఉపాధి చేసుకుంటేనే పుట్టినూర్లోనే ఉంటూ భక్తులకు బోధనలు చేసేవారు. భక్తులు తద్వారా వారి ఈతి బాధలనుంచి ఉపశమనం పొందేవారు. ఈ యోగులు, అచల గురువుల గురించి ఆంధ్రయోగులు సంపుటాల్లో బిరుదురాజు రామరాజు వివరంగానే రాసిండు. అయితే ఆయన యోగతత్వాన్ని మాత్రమే వాటిల్లో రికార్డు చేసిండు. సాహిత్యంపై దృష్టి పెట్టలేదు. ఆయన దృష్టినుంచి తప్పించుకున్న అచలగురువు, వాగ్గేయకారుడు, కీర్తనాకర్త ఉదారి నాగదాసు. అచల పరంపరను ఆదిలాబాద్ జిల్లాలో గురుభజన తత్వ కీర్తనలు రాసి ఆరంభించిన, ప్రచారం చేసిన గురువు ఉదారి నాగదాసు.

ఆదిలాబాద్ జిల్లా, తాంసి మండలం, బండల్ నాగాపూర గ్రామానికి చెందిన నాగదాసు 1930 ఆ ప్రాంతంలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు యశోదమ్మ, భుజంగయ్య. ముందే చెప్పినట్టు అచల బోధకులు తమ కులవృత్తిని చేసుకుంటూనే ఆధ్యాత్మిక మార్గంలో నడిచేవారు. నాగదాసు సైతం తమ కుల వృత్తి కమ్మరి పని చేసుకుంటూనే విశ్రాంత సమయంలో తత్వాలు రాసి, అచల బోధనలు చేసేవారు. ఈ బోధనలు తెలంగాణలో ముఖ్యంగా ఆదిలాబాద్ చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో బహుళ వ్యాప్తిలో ఉన్నాయి. అచల పరంపరలో పేరెన్నికగన్న పొన్నాల రాజయోగి ఈయన గురువు. అచలంలో గురువుకు ప్రత్యేక స్థానముంటుంది. మిగతా అచల బోధకులకన్నా నాగదాసు కొంచెం భిన్నమైన మార్గంలో నడిచాడు. అందరూ భక్తి, యోగ తత్వాన్ని మాత్రమే చెబితే, నాగదాసు దానికి కుల చైతన్యాన్ని కూడా జోడించాడు.

"విశ్వకర్మావారము
సృష్టికి భలే ఇష్టమైనవారము
పంచభూతములనేటి యా
పంచదాయుల నిర్మించినారము
పంచ ఇరువైదయిదక్షరముల
పంచాక్షరి పఠియించినారము" అంటూ సరళ, సుబోధకంగా అందరికీ అర్థమయ్యే రీతిలో తత్వాలను చెప్పిండు. మరో కీర్తనలో విశ్వబ్రాహ్మణుల విశిష్టతను ఇట్లా చెప్పిండు.

"పొట్టబాధచె ప్రాణముబోయితె
కర్రునాగలి దయతోనిచ్చె



కట్టుగుడ్డసె మానముబోయితె
కదురుచేసి నూలు వస్త్రము నిచ్చె
అరె ఇట్టిమానవుడె విశ్వకర్మయని
తలచుర నీవీడా
తలచుతె జయముందిరా ఆడా" అంటూ ఇట్లా ఒక్కొక్క కీర్తన ఐదు, ఆరు చరణాలు కూడా ఉన్నాయి. వాటిల్లో విశ్వబ్రాహ్మణుల విశిష్టతను, కుల పరంగా వారి ప్రాధాన్యతను సాహిత్యంలో రికార్డు చేసిండు.

"విశ్వకర్మలేని విశ్వంబులేదనే
వేమన్న మాటనె వేదం
వీరబ్రహ్మంగారి విషయాలు తెలివాయె
విశ్వసించితె మనకు మోదం"
...
వెట్టి బ్రహ్మము యనుచు విట్టవీగిన వారి
పుట్టె నింపెను మంచి జ్ఞానం
తిట్టిగుణములు గల్ల శిష్య బక్కిబృందము
యొక్క తిక్క తెంపెను బ్రహ్మజ్ఞానం"
"విశ్వమె వీరబ్రహ్మమయా
ఈ జ్ఞాన విధమెరుగుమయా"
"నాగదాసు బోధనాదమును
నామరూపులేని వేదమును
నమ్మితె ఫలం, నరజన్మ విధం తెలిపెను
సదాశివదాసుడయ్యా"
"ఆగము దిరుగకురా
నాగదాసు బోధవినరా
ఆగము దిరుగకు జాగు చేయకను
వేగిర పదుమూర బోధ నొందుటకు" అంటూ ఆయన అనేక కీర్తనలు రాసిండు. తెలుగులో భక్తి సాహిత్యానికి ప్రధానంగా అచల సాహిత్యానికి మేలయిన జోడింపు జేశాడు.

తెలుగు, హిందీ సినిమా బాణిలో కీర్తనలు రాసి భక్తులకు తత్వాన్ని బోధించడంలో నాగదాసు దిట్ట. అందుకే ఆయన కీర్తనలు అందరికీ తెలిసిన పాపులర్ బాణిల్లో ఉండేవి. వాటిలో 'కల నిజమాయెగా', ఏరువాక సాగారో రన్నో చిన్నన్న, పిలువకురా అలుగకురా, జయకృష్ణా ముకుందా మురారి, ఇల్లు వాకిలి నాది, పయనించే ఓ చిలుకా, పాండురంగ నామం పరమపుణ్య ధామం, రేష్మీ సల్వార్ కుర్తా, మన్ డోలె తన్ డోలె, ఎక్ దిల్‌కె టుక్‌డే హజార్‌హువే, జరా సామ్‌నెతో ఆవో చెలియె, తెరెకోటి పాపాకట్ జాయె తదితర సినిమా ఫక్కీలో కీర్తనలు రాసిండు. ఇట్లా భక్తితత్వాన్ని శిష్యులకు అందించిండు.

వేమన, పోతులూరి, శివరామదీక్షితులు తదితర గురువుల రచనల ప్రభావం నాగదాసుపై ఎక్కువగా ఉన్నది. అంతేగాదు తన సమకాలీనులు పరమేశ్వరయ్య, జక్కుల కాశయ్య, తాంసి సదాశివలతో సదా తత్వ చర్చలు చేసేవారు. సద్గురువులను ఎంతగా ప్రేమించే వారో మాయ గురువులను అంతగా నిరసించిండు. నాగదాసు పెద్దగా చదువుకోక పోయినా శ్లోకాలు, కంద పద్యాలు, దరువులు, కీర్తనలు, మంగళహారతులు, ఉయ్యాల పాటలు రాసి మెప్పించిండు. అందులో తెలంగాణలో బాగా ప్రాచుర్యం ఉన్న ఉయ్యాల దరువులో రాసిన కీర్తన ఇలా ఉంది.



డా. సంగిశెట్టి శ్రీనివాస్
9849220321

"శ్రీగురుని జేరియు ఉయ్యాలో
తత్వయోగము తెలిసి ఉయ్యాలో
ఆదివారం నాడు ఉయ్యాలో లేచిన తర్వాత
ఉయ్యాలో
కుడిముక్కున స్వరము ఉయ్యాలో
ఉండవలసినదమ్మ ఉయ్యాలో" అంటూ ఇట్లా ఆదివారం నుంచి శనివారం వరకు శ్రీగురుని బోధనలు చేసిండు. చివర్లో
"ఈమాట ఎవరు దెల్పిరి ఉయ్యాలో
నిర్మలాలపురమందు ఉయ్యాలో
లక్ష్మణార్యులు దెలిపె ఉయ్యాలో
వారి కరుణజాత ఉయ్యాలో
దాసుండు నాగమయ్య ఉయ్యాలో
దోసిలొగ్గి తెలిపె ఉయ్యాలో" అంటూ తనకు ఈ విషయాలను బోధించిన నిర్మల్‌కు చెందిన లక్ష్మణార్యులను కీర్తనాంతమున స్మరించుకున్నాడు.
సెప్టెంబర్ తొమ్మిది 1976నాడు పిన్నవయసులో అంటే 46వ యేట మృతి చెందిన నాగదాసు మొదట 'శ్రీ శివరామ దీక్షితాచల గురుభజన తత్వ కీర్తనలు' పేరిట 1962లో మరాఠీ (హిందీ) లిపిలో ముద్రించాడు. ఈ గ్రంథానికి మరిన్ని కీర్తనలు జోడిరచి 1974లో తెలుగులో వెలువరించారు. మరోసారి 2011లో వారి కుటుంబ సభ్యులు ఈ గ్రంథాన్ని పునర్ముద్రించారు.
ఈ నాగదాసు స్మారకంగా ప్రతి సంవత్సరం ఒక విశిష్ట సాహితీవేత్తకు అవార్డు ఇచ్చి సత్కరిస్తున్నారు వారి కుటుంబ సభ్యులు. 2025 సంవత్సరానికి గాను ఈ అవార్డుని కవయిత్రి తోట నిర్మలారాణికి అందిస్తున్నారు. ఈ అవార్డు ప్రదాన సభ సెప్టెంబర్ ఏడున ఆదిలాబాద్‌లో జరుగనుంది.

**(సెప్టెంబర్ తొమ్మిదిన ఉదారి నాగదాసు వర్ధంతి)**

## వర్తమాన సమాజ దిక్సూచి


# నువ్వే ఒక సమూహం

సాధారణంగా కవులు తమ చుట్టూ ఉన్న సామాజిక రాజకీయ అంశాలకు ప్రభావితమై వాటినే తమ కవితా వస్తువులుగా ఎంచుకుని కవిత్వం రాస్తుంటారు. కానీ వాటిలో తమకు తోచిందల్లా రాసేవారు ఒక సమూహం. సమాజానికి అవసరమయ్యేవి మాత్రమే రాసేవారు మరొక సమూహం. నేటి ఆధునిక కాలంలో రకరకాల సామాజిక మాధ్యమాల ప్రభావం వల్ల ప్రతి అంశాన్ని కవిత్వీకరించి పాఠకాధరణ పొందటం కష్టతరమే. అయితే వర్తమాన సమాజానికి అవసరమయ్యే వస్తు వ్యక్తికరణ ఏ ప్రక్రియలో ఉన్న అది సాహితీరంగంలో తన స్థానాన్ని పదులపరుచుకుంటుంది. దీనికి నిలువెత్తు సాక్ష్యంగా డా. మహమ్మద్ హసేన రాసిన "నువ్వే ఒక సమూహం" అనే కవితా సంపుటి చక్కటి ఉదాహరణ. ఈ సంపుటిలో ప్రజా చైతన్య కవిత్వం, సంఘటనాత్మక కవిత్వం, స్వీయానుభవ కవిత్వం అని మూడు ప్రధాన వర్గాలైన కవితలు కనిపిస్తాయి.

సంఘజీవియైన మనిషి లక్ష్యసాధనలో పరాజయం పాలైనప్పుడు గాని, భవబంధాలు విచ్ఛిన్నమైనప్పుడు గానీ ఒంటరితనం అప్రయత్నంగానే అపరిచిత వ్యక్తి వలె పలకరిస్తుంది. అది కొంతకాలం సమస్యల చిక్కుల్లోంచి బయటపడటానికి, మనసు విహంగ వీక్షణంగా సేద తీరటానికి ఒక ఔషధంగా పనికొచ్చినా కాలం గడుస్తున్నా కొద్ది అది మందులేని విషంగా మారి మనిషిని నిరాశ నిస్పృహలతో పూర్తిగా అచేతనంలోకి తీసుకెళ్తుంది. దీని నుండి బయటపడి ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తే ఒక వ్యక్తి ఒక వ్యవస్థగా మారతారని "నువ్వే ఒక సమూహం" కవితా సారం నేటి సమాజానికి దిక్సూచిగా నిలుస్తుంది.

"ఒంటరితనం నీకొక్కడికే అనుకుంటున్నావేమో
నది పుట్టుక కూడా ఒంటరిగానే మొదలైతుంది
నువ్వొంటరివని ఎవరన్నారిప్పుడు
ఒక్కసారి నీ అంతస్సముద్రంలోకి
నీకై నీవు పారిచూడు
అంతుచిక్కని సమూహాలెన్నో
నీ ఆజ్ఞకోసం ఎదురుచూస్తుంటాయి".

అంటారు ఈ కవితలో. విశ్వంలోని భూమిని సూక్ష్మ దృష్టితో పరిశీలిస్తే చిన్నచిన్న ఇసుక రేణువులు, మట్టి ముద్దలు ముద్దలుగా కలిసి ఒక సువిశాలమైన భూమిలా అవతరించడం మనం గమనించవచ్చు. అలాగే ఒక్కొక్క చుక్క కలిసి మహాసముద్రాలు వెలిసినట్లు నీవు వేసే ఒక్క అడుగు నీవు చేసే ఒక్క ప్రయత్నం నీకే తెలియని, నీలో దాగి ఉన్న నవ్వు ఒక సమూహ శక్తితో సమానం అని, నీ అంతస్సముద్రంలోకి పారి చూసి అద్భుతాలు సృష్టిస్తే నీ ఆజ్ఞ కోసం అనేక సమూహాలు ఎదురుచూస్తాయని.కావున మనిషి ఎప్పుడు ఒంటరి కాదని అనేక రకాల శక్తి సమూహాలు అతనిలో దాగి ఉంటాయి అని అంటాడు.




పుస్తక సమీక్ష

"కాలం కలిసి రావట్లేదని నిరాశపడకు కార్యం
మంచిదైతే కాలం కూడా సహకరిస్తుంది"

అంటాడు "ఆశ" అనే కవితలో. మానవుడు ఎప్పుడు కూడా నిరాశ నిస్పృహలకు లోనవకూడదని తాను చేయాల్సిన పని చేయకుండా అవివేకపు సమాధానాలు వెతుక్కోవద్దని సూచిస్తాడు. ఇందులో మంచి కార్యము అంటే కష్టపడే తత్వం అని ఇక్కడ అర్థం.

మరో కవితలో "శిశిరం పోతేనే వసంతం వికసిస్తుంది అహాన్ని వీడితేనే ఆత్మసాక్షాత్కారం సిద్ధిస్తుంది "అని వ్యక్తి ఆహాన్ని శిశిర ఋతువుతో సాదృశ్యం చేసి నేనే గొప్ప అనే అహంకారాన్ని విడనాటితేనే సంపూర్ణ మానవత్వం వరిస్తుందంటాడు. "ఒక్క సిరా చుక్క లక్ష మెదడులకు కదలిక" అన్న ప్రజాకవి కాలోజీ కవితార్థం వచ్చే విధంగా అక్షరం చిన్నదైనా ఆయుధమై పోరాడుతుంది అంటాడు మరో కవితలో. ఇది అక్షర సత్యం నేడు ఎంతో మంది మహనీయులు మన కళ్ళ ముందు లేకున్నా వారు పదిల పరిచిన అక్షరమే ఒక ఆయుధమై సామాన్య ప్రజలచే పోరాడింపజేస్తుంది.

భారతదేశ గొప్పతనమైన భిన్నత్వంలో ఏకత్వం ఏకత్వంలో భిన్నత్వాన్ని "లౌకికతత్వం" అనే కవితలో సప్తవర్ణాలు కలిసి ఇంద్రధనస్సుకు రూపం ఇచ్చినట్టు ఖురాన్, బైబిల్, గీతాసారం ఒక్కటిగా కలిసి భారతావనికి బహు ఘనకీర్తి తెచ్చింది అంటాడు.

"వాళ్లేమో రామరాజ్యం అంటారు
వీళ్లేమో ఇస్లామిక్ రాజ్యం అంటారు
అవి రెండు జరగాలంటే ఎన్ని తలలు తెగాలి
మత యుద్ధాలు, మత ఘర్షణలతో
సాధించేదిఏమిటి"... అని "నువ్వు నేను బాయి బాయి" అనే కవిత శీర్షికలోనివి పై వాక్యాలు . "మతం" అనేది మానిషి మంచి జీవన విధానానికి కాకుండా ఎవరైతే మతం మత్తులో మునిగి తీవ్రవాదులుగా, ఉగ్రవాదులుగా మారి మతపరమైన యుద్ధాలకు కారణమవుతారో వారు సాధించేది ఏమీ లేదని, మతం కంటే మానవత్వమే గొప్పదని ఈ కవిత ద్వార చాటి చెప్తారు. స్త్రీలు కూడా పురుషులతో పాటు సమానంగా గౌరవింపబడాలని స్త్రీవాద దృక్పథంలో "వివక్ష ఎందుకు" అనే కవితను ఆవిష్కరించారు ఇందులో ...


"జన్మజన్మల వాగ్దానాలు కాదు
ఈ జన్మలోనే ఆనందాల్ని అందించు
నీతో సమానమే అయినప్పుడు నన్ను
కూడాగౌరవించు"... అని స్త్రీలపై వివక్ష తగదని
హితవు చెప్తారు .

మరో కవితలో చేతిలో గీతల్ని పదేపదే చూసుకొని మురిసి పోకు అవి నీ జాతకాన్ని మార్చే అదృష్ట రేఖలు కావు" అని సమాజం యొక్క మూఢ అంధకారాన్ని విడనాడి వాస్తవికత వైపు పయనించాలని చెప్తారు. తర్కం కవితలో "గుడికెళ్తే దేవుడు కరుణిస్తాడని నమ్ముతాం బడికి వెళ్తే భవిష్యత్తు మారుతుందని నమ్మం" అని చెప్పడం నవ సమాజ నిర్మాణం పట్ల కవికి ఉన్న సంఘర్షణ కనిపిస్తుంది.

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ గీతాంజలికి హృదయ సమాన గేయమైన "where the mind is without fear..." లాంటి శిల్ప నిర్మాణంతో ఆర్ట్స్ కాలేజ్ "రూమ్ నెంబర్ 57" అనే కవిత ఉంటుంది. ఇది ఉద్యమాల పురిటిగడ్డ అయిన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఖ్యాతిని మదినిండా నెమరేస్తుంది.

ఇలా చైతన్య ధోరణి కవితలతో పాటు పహల్గం దాడి, గాజాలో జరిగిన అమానవీయ అంతర్జాతీయ సంఘటనలు, గద్దర్, సిరివెన్నెల సీతారామశాస్త్రి వంటి అంకిత భావం కలిగిన ఆదర్శమూర్తులను స్మరిస్తూ సమాజంలో నూతనోత్తేజాన్ని రగిలిస్తుంది డాక్టర్. మహమ్మద్ హసేన గారి నువ్వే ఒక సమూహం కవితా సంపుటి.

- డా. ఇసరం శ్రీనివాస్,
9652723900



# జ్వలించిన కవియోధుడు

నిర్భీతికి ప్రతిబింబం
అన్యాయంపై అగ్నిగోళం
ఉద్యమ భాస్వరం
నిరసనై జ్వలించిన కవిత్వం
భాషా ప్రయోగాలకు వెన్నుదన్ను
కష్టాలకు చెమ్మగిల్లిన కన్ను
ప్రజల గొడవకు అక్షరీకరణ
ఇజాలు లేని నిజాలకు
ఉదాహరణ
సామాజిక చైతన్య స్వరూపం
నిరాడంబరమే ఆయన నైజం
ప్రజాహృదయమే
ఆయన నివాసం
కాళోజీ ప్రజామిత్రుడు
ప్రశ్నించే వాడే ఆయనకు ఇష్టుడు
ఎదురు తిరిగి నిలదీసినవాడే
ఆప్తుడు

(సెప్టెంబర్ 9 ప్రజాకవి
కాళోజీ జయంతి...)

- డా. తిరునగరి శ్రీనివాస్,
9441464764

# ఎవరి లబ్ధి కోసం ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చారు

- సన్నకారు రైతులకు నష్టం కలిగించేలా ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్
- చావనైనా చస్తాం కానీ ట్రిబుల్ ఆర్ నిర్మాణానికి తమ భూములను ఇవ్వం
- ఏకపక్ష నిర్ణయంతో ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్
- హైవే పై బైఠాయింపు, నిరసన ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం



**ఆమనగల్లు, మహా:** రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ట్రిబుల్ ఆర్ పై కల్వకుర్తి నియోజకవర్గం రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో సంకటోనిపల్లి ,వెంకట్రావుపేట, గౌరిపల్లి,జంగారెడ్డిపల్లి, చంద్రధనకు చెందిన సుమారు 150 మంది రైతులు సన్నకారు రైతులకు నష్టం కలిగించేలా ట్రిబుల్ ఆర్ అలైన్మెంట్ ప్రభుత్వం మార్చిందని, పెద్దల భూములు కాపాడేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉన్న రెండు మూడు ఎకరాల రాష్ట్ర ప్రభుత్వము తీసుకుంటే మా పిల్లల భవిష్యత్తులో ఏమి కావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చావనైనా చస్తాం కానీ ట్రిబుల్ ఆర్ నిర్మాణానికి తమ భూములను ఇవ్వమని ముక్తకంఠంగా తెలిపారు.ఆర్ఆర్ఆర్ వల్ల మిగిలిన భూములు కూడా కోల్పోతే ఆ రైతులకు ఆత్మహత్యే శరణ్యమని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎవరి లబ్ధి కోసం అలైన్మెంట్ మార్చారని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రయోజనాల కోసమే మారిందని ప్రజలు, రైతులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం ట్రిపుల్ ఆర్ అలైన్మెంట్ ను ఏకపక్షంగా ప్రకటించి రైతులను గందరగోళం లో పడేసిందని ఆరోపించారు. సరైన సర్వే నిర్వహించకుండా అలైన్మెంట్ పేరుతో సర్వే నంబర్లు ప్రకటించడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో ఉన్న అలైన్మెంటను ఎందుకు మార్చాల్సి వచ్చిందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేసి ఎమ్మెల్యే కసిరెడ్డి,ప్రభుత్వానికి వ్యతిరేకం గా నినాదాలు చేశారు.. నిరసన చేస్తున్న రైతులను పోలీసులు పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# ఘనంగా ఖానాపూర్ గణనాథుని శోభాయాత్ర

## భగత్ సింగ్ లంబోదరుని లడ్డు అంజయ్య కైవసం



**రంగారెడ్డి జిల్లా మహా:** ఖానాపూర్ భగత్ సింగ్ యువజన సంఘం ఆధ్వర్యంలో వినాయక చతుర్థి సందర్భంగా నెలకొల్పిన వినాయకుని శోభయాత్రను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. గత తొమ్మిది రోజులుగా భక్తిశ్రద్ధలతో నిష్టగా పూజలు చేసి, ఆ యొక్క గణనాధుని ఆశీర్వాదాలు పొందిన భక్తులు, శనివారం ఘనంగా భజనలతో, జిగేల్ మనిపించే విద్యుత్ కాంతులు, డీజే సౌండ్ లతో శోభయాత్ర కొనసాగింది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ, ఖానాపూర్ గ్రామంలోని భగత్ సింగ్ యువజన సంఘం నెలకొల్పి భక్తిశ్రద్ధలతో నిష్టగా పూజలు అందించిన గణనాధుని లడ్డును, వేలం పాటలో లక్ష 60,000 రూపాయలకు, దొంతరమోని అంజయ్య కుటుంబ సభ్యులు కైవసం చేసుకున్నారు. నవరాత్రులు ముగించుకొని శోభయాత్రగా బయలుదేరిన గణనాథునికి, గ్రామ ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పట్టారు. భక్తితో పూజలు చేశారు. యువతీ యువకులు కోలాహలంగా కేరింతల నడుమ గంగమ్మ ఒడికి సాగనంపారు. ఈ సందర్భంగా ఏఎంసీ డైరెక్టర్ రాజు, మాజీ వార్డ్ మెంబర్ డి రమేష్, డి రాములు, డి సోమయ్య, నరేష్, బుగ్గరాములు, మహేష్, యువజన సంఘం సభ్యులు, యువతీ యువకులు, ముదిరాజ్ సంఘం పెద్దలు పలువురు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఈ నెల 10న సన్మానం



లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఈ నెల 10న కల్వకుర్తి నియోజకవర్గం లోని వివిధ మండలాలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్నట్లు క్లబ్బు అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి పిఆర్ఓ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

**ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..**

కల్వకుర్తి నియోజకవర్గం నుండి 26 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నుకున్నారు. ఆమనగల్లు మండలం నుండి హైమావతి (లిటిల్ స్కాలర్స్ టెక్నో స్కూల్), చందర్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల), నరేష్ (అరబిందో హైస్కూల్), పుష్పాంజలి (ఎస్ జి టి ), కడ్తాల్ మండలం నుండి కౌసల్య (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల), రాజు (ఎక్వాయి పల్లి పాఠశాల), విష్ణు (కడ్తాల్ గ్రామర్ స్కూల్),జైసన్ (ప్రగతి హై స్కూల్), తలకొండపల్లి మండలం నుండి మీనా కుమారి (జంగారెడ్డి పల్లి ఎస్జిటి), స్వాతి (అక్షర హై స్కూల్), లక్ష్మణ్ (విశ్వవిజేత హై స్కూల్), మణిపాల్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాంపూర్), పాండు (ఎంపీపీ ఎస్ చుక్కపూర్), మాడుగుల మండలం నుండి ప్రభాకర్ రెడ్డి (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొలు కులపల్లి ), కళ (ఎంపీపీ ఎస్ కలకొండ ), శ్రీనివాసులు (నవోదయ విద్యాలయము), వైకుత్తన్ (సెంట్ మేరీ హై స్కూల్), కల్వకుర్తి మండలం నుండి (మోహన్ సరస్వతి శిశు మందిర్), శివకుమార్ (బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్ ), రాజేశ్వరి (తర్నికల్ ఎస్జిటి),వజ్ర లింగం (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ), అనంతరావు (లింగరావుపల్లి ), వెల్దండ మండలం నుండి రాజశేఖర్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల), విష్ణువర్ధన్ (గొల్లోనిపల్లి ),లచ్చిరాం (రామన్ కాన్వెంట్ స్కూల్ పెద్దాపూర్ ), అంజయ్య (తక్షశిల హై స్కూల్ ) మొదలైన ఉపాధ్యాయులను బుధవారం 10 సెప్టెంబర్ రోజు సత్కారం చేయనున్నట్లు క్లబ్ ప్రెసిడెంట్ గోవర్ధన్ రెడ్డి పీఆర్ఓ పాషా తెలిపారు



# ఉచిత వైద్య శిబిరంలో పలు రకాల వైద్య పరీక్షలు

**రాజేంద్రనగర్ మహా;** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ పరిధిలోని రేనా క్లినిక్ ఆధ్వర్యంలోఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. క్యుసిడి ల్యాబ్స్ అధినేత రవీందర్ గౌడ్, ల్యాబ్ టెక్నీషియన్లు రమేష్, అల్థమస్, సునీల్, సంగీత, పూజ ఆనంద్ నగర్, ధాత్రి కాలనీ వాసులకు రక్త పరీక్ష, మధుమేహం, థైరాయిడ్ వంటి ఆరోగ్య పరీక్షలు చేశారు. రేనా క్లినిక్ కు చెందిన గైనకాలజిస్ట్ డా ఎలిజబెత్ మండేలా, రోగులను పరీక్షించి మందులను అందజేశారు. ఆనంద్ నగర్ కాలనీవాసులతో పాటు ధాత్రి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎమ్ శివరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కొండా ఆనందరెడ్డి, వి భాస్కర రెడ్డి, గాజుల చంద్రశేఖర్, కె చంద్రశేఖరరెడ్డి, కొంపెల్ల కామేశ్వరరావు, ఎన్ రామలింగం, ఉలిగేశ్వర్,శంకర్, ప్రసాద్ యాదవ్ పలువురు ఈ వైద్య శిబిరంలో పాల్గొన్నారు.

# లడ్డును కైవాసం చేసుకున్న కాట సుధా శ్రీనివాస్ గౌడ్



**పటాన్ చేరు మహా :** పటాన్ చెరు నియోజకవర్గం అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ శివాలయం సర్కిల్ లో పెట్టిన సిద్ధి వినాయక కమిటీ వారు పెట్టిన గణనాథుడి నిమార్జన కార్యక్రమనికి ముఖ్యతిథిగా కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్బంగా లడ్డు వెలంపాట జరిగింది. 4లక్షల 56 వేల రూపాయలకు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యాక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ లడ్డును కైవసం చేసుకున్నారు.ఈ సందర్బంగా కమిటీ సభ్యులు సుధాకర్ యాదవ్ మట్లాడుతు 15సంవత్సరాల నుండి ఇక్కడ గణేశుని పెడుతున్నాం ఇక్కడ లడ్డు కొన్నవారికి మంచి జరిగింది మంచి స్థాయికి ఎదుగుతరని ఒక నమ్మకం అని తేలిపారు.ఈ సందర్బంగా కాట సుధా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతు ఆ బగవంతున్ని ఆశీస్సులతో ఈ లడ్డు నాకు రావటం నా అదృష్టం అని ఆ గణనాధుడి ఆశీస్సులు నియోజకవర్గం ప్రజల పై ఉండాలనీ అందరినీ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలనీ కోరుతున్నా అని అన్నారు.

# వరుసగా మూడోసారి లడ్డూ కైవసం చేసుకున్న బాలగౌని సాయిచరణ్ గౌడ్



**పటాన్ చేరు మహా :** పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలో గణేష్ గడ్డ పై ఉన్న శ్రీ సిద్ధి వినాయక దేవాలయం గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా గణనాథుడి లడ్డూ వేలం పాట జరిగింది. మూడోసారి ఈ లడ్డూను పటాన్ చేరు బీఆర్ఎస్ యువ నాయకుడు బాలగౌని సాయిచరణ్ గౌడ్ సొంతం చేసుకున్నారు. ఇక్కడి లడ్డూను సాయిచరణ్ గౌడ్ 2023లో 3,50,000/ సొంతం చేసుకోగా, గత ఏడాది 6,25,000/ సొంతం చేసుకున్నాడు. ఈ ఏడాది మూడోసారి లడ్డూను 7,00,000/ లక్షలకు సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణనాథుడి లడ్డూ వరుసగా మూడోసారి మా కుటుంబానికి దక్కడం మా అదృష్టం అని ఇది స్వామివారి ఆశీర్వాదంగా భావిస్తున్నాం అని అన్నారు. ఉత్సవ సమితి సభ్యులు మాట్లాడుతూ సాయిచరణ్ గౌడ్ కుటుంబంపై ఎల్లప్పుడూ గణనాథుడి కృప ఉండాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నాం అని తెలిపారు.



# గణనాథుని లడ్డూలకు క్రేజ్

**రాజేంద్రనగర్ మహా ;** మైలారదేవ్ పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మి గూడా ఫ్రెండ్స్ యూత్అ సోసియేషన్ హౌసింగ్ బోర్డ్ కాలనీ లడ్డు వేలం పాటలో అక్షర స్కూల్ యజమాన్యం డి రమేష్ ముదిరాజ్, కరుణాకర్ 1,56 వేల రూపాయలకు స్వామి వారి లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ తొండుపల్లి పోచమ్మ గుడి వినాయకుని చివరి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించి లడ్డు లక్ష నలభై ఏడు వేల రూపాయలకు మాజీ కౌన్సిలర్ పారేపల్లి లావణ్య శ్రీనివాస్ గౌడ్ కైలాసం చేసుకున్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నవరాత్రి పూజల అనంతరం ఆదివారం నిర్వహించిన వేలంపాటలో వార్డు మాజీ కౌన్సిలర్ పారేపల్లి లావణ్య శ్రీనివాస్ గౌడ్ వినాయకుడికి లడ్డూను సొంతం చేసుకోవడం వరుసగా ఇది తొమ్మిదవ సారి కావడం విశేషం. ఈ సందర్భంగా వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వినాయకుడిని తోండుపల్లి మండపం నుంచి బ్యాండు మేళాలతో ఊరేగించారు. ధూంధాం గా ఊరేగింపు నిర్వహించిన అనంతరం తొండుపల్లి చెరువులో స్వామివారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

# 9 నుంచి అఖిల భారత జైల్ డ్యూటీ మీట్ - 2025

## తెలంగాణ రాష్ట్ర జైళ్లు, సవరణ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా ఐపిఎస్




**హైదరాబాద్, మహా:** తెలంగాణ జైలు మరియు సవరణాశాఖ ఆధ్వర్యంలో 7వ అఖిల భారత జైలు డ్యూటీ మీట్ - 2025 ఈ నెల సెప్టెంబర్ 9 నుండి 11 వరకు హైదరాబాదులోని ఆర్బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో జరగనుంది. దేశంలోని 21 రాష్ట్రాలు మరియు 3 కేంద్రపాలిత ప్రాంతాల నుండి వచ్చిన 1,300 మందికి పైగా జైలు సిబ్బంది (ఇందులో 184 మంది మహిళలు) పాల్గొని 36 విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. వీటిలో ప్రథమ చికిత్స, వెల్ఫేర్ పథకాలు, క్విజ్, కంప్యూటర్ నైపుణ్యం వంటి వృత్తి సంబంధిత పోటీలు, అలాగే అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్ బాల్, కరాటే, క్రావ్ మాగా, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం వంటి క్రీడలు, సాంస్కృతిక పోటీలు ఉంటాయి. ఈ ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్రం రెండవసారి ఆతిథ్యం ఇస్తోంది. 2015లో తొలిసారి నిర్వహించగా, 2022లో అహ్మదాబాద్‌లో జరిగిన 6వ జైలు డ్యూటీ మీట్‌లో తెలంగాణ రాష్ట్రం ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించింది. ఈసారి తొలిసారిగా ఆల్ ఇండియా టెక్నో ఎక్స్‌పో మరియు జైలు ఉత్పత్తుల ప్రదర్శన స్టాళ్లు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. సన్నాహక కార్యక్రమంలో భాగంగా, తెలంగాణ జైలు సవరణాశాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా, ఐపీఎస్ తెలంగాణ కాంటిజెంట్ జట్టు సభ్యులైన 84 మందికి క్రీడా కిట్లను పంపిణీ చేసి, జాతీయ స్థాయిలో క్రమశిక్షణతో ఆత్మవిశ్వాసంగా రాణించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి శాఖ, బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ & డెవలప్‌మెంట్, న్యూఢిల్లీ మరియు కేంద్ర హోంమంత్రిత్వశాఖతో సమన్వయం చేసుకుంటూ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 9వ తేదీన మంగళవారం ఉదయం 9:30 గంటలకు హిమాయత్ సాగర్ లోని పోలీస్ అకాడమిలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని జైలు డ్యూటీ మీట్ ను ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.రామకృష్ణారావు ఐఏఎస్, రాష్ట్ర హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రవి గుప్తా ఐపిఎస్, రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ ఐపిఎస్, తదితరులు పాల్గొంటారని తెలిపారు.

# నేడు టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం

**హైదరాబాద్, మహా:** నేడు ఉదయం 11 గంటలకు టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం గాంధీభవన్ లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన జరగనుంది. ఈ సమావేశానికి ఏఐసీసీ ఇంచార్జ్ ప్రధాన కార్యదర్శి మీనాక్షి నటరాజన్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. ఈ మేరకు పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సమావేశానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, డీసీసీ అధ్యక్షులు, టీపీసీసీ ఉమ్మడి జిల్లాల ఇంచార్జ్ లు, అనుబంధ సంఘాల ఛైర్మన్ లు, కార్పొరేషన్ చైర్మన్ లు, జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కో ఆర్డినేటర్లు, జిల్లా కమిటీ కోసం వేసిన కో ఆర్డినేటర్లు అధికార ప్రతినిధులు, జై బాపు జై భీమ్, జై సంవిధాన్ కమిటీ సభ్యులు పాల్గొనాలని సూచించింది.



## కన్నుల పండుగగా

# చండీశ్వర్ యూత్ గణేష్ నిమజ్జనం

**రంగారెడ్డి జిల్లా మహా:** మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామానికి చెందిన చండీశ్వర్ యూత్ వినాయక నిమజ్జన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తెలంగాణ సంప్రదాయ ఒగ్గు కళాకారులు సంప్రదాయ వేషాధారణతో వినూత్న విన్యాసాలతో కళాకారుల ఆట పాటలతో జనాలను అలరించారు. లడ్డు వేలంపాటలో మొదటి లడ్డును రూ 82 వేలు రావుల బీరప్ప తీసుకోగా రెండవ లడ్డు 41 వేయి చిందం బుచ్చయ్య కైవసం చేసుకున్నారు. ఉత్సవాలను తిలకించడానికి ప్రజలు వేలాదిగా తరలి రావడంతో ప్రధాన రోడ్లు స్థంభించాయి. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులు, యువజన సంఘాల నాయకులు, భక్తులు హాజరయ్యారు.

## ఆయిల్ పామ్ సాగులో

# దేశానికే తెలంగాణ హబ్

- రాష్ట్రంలో పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగవుతోంది
- 31 జిల్లాల్లో సాగుకు అనుకూల వాతావరణం ఉంది
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీనీ ఆకస్మికంగా తనిఖీ



**అశ్వారావుపేట, మహా:** తెలంగాణ వ్యాప్తంగా పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగవుతోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. ఆదివారం అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీనీ ఆకస్మికంగా తనిఖీ చేశారు మంత్రి తుమ్మల. తరచూగా ఫ్యాక్టరీ బ్రేక్ డౌన్‌పై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. పామాయిల్ గెలలు నిల్వ ఉండకుండా క్రషింగ్ చేయాలని అధికారులకు సూచించారు. ఎక్కువగా వచ్చిన పామాయిల్ గెలలు అప్పారావు పేట ఫ్యాక్టరీకి తరలించాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. అనంతరం మీడియాతో మంత్రి తుమ్మల మాట్లాడారు. 31 జిల్లాల్లో ఇరవై లక్షల ఎకరాలు ఆయిల్ పామ్ సాగుకు అనుకూల వాతావరణం ఉందని తెలిపారు.

**రైతులకు మంచి ఆదాయం, భవిష్యత్ లోనూ..**

ఒక్కో ఉమ్మడి జిల్లాకు లక్ష ఎకరాల చొప్పున పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలని సూచించారు. సిద్దిపేట పామాయిల్ రిఫైనరీని త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని చెప్పుకొచ్చారు. పామాయిల్ గెలలు టన్ను రూ.25 వేలు ఉండేలా ప్రోత్సహించాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి స్వయంగా కలిసి వివరించానని గుర్తుచేశారు. అన్నదాతలు ఆత్మ గౌరవంతో, ఆరోగ్యంగా ఉండేది ఒక్క వ్యవసాయ రంగమేనని చెప్పుకొచ్చారు. రానున్న రోజుల్లో రైతులకు మంచి భవిష్యత్ ఉందని ఉద్ఘాటించారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ దేశానికి హబ్‌గా మారనుందని నొక్కిచెప్పారు. ఆయిల్ పామ్‌లో అంతర పంటల సాగు రైతులకు అదనపు ఆదాయమని తెలిపారు. ఆయిల్ ఫెడ్‌తో పాటు ప్రైవేట్ రంగంలో పామాయిల్ రిఫైనరీ ఫ్యాక్టరీల ఏర్పాటుతో ఆయిల్ పామ్ రైతులకు దీర్ఘకాలిక మేలు జరుగుతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.




# ప్లాస్టిక్ గోదాంలో అగ్ని ప్రమాదం

## ముడి సరుకు కాలిపోవడంతో భారీగా పొగ మంటలు..

**రాజేంద్రనగర్, మహా ;** మైలార్దోపల్లి పోలీస్ స్టేషన్ పరిధి టాటా నగర్ లోని ఓ ప్లాస్టిక్ గోదాంలో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. ప్లాస్టిక్ గోదాంలోని ప్లాస్టిక్ సంబంధించిన ప్లాస్టిక్ ముడి సరుకు కంపెనీలో ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ మంటలను చూసి స్థానికులుభయాందోళనకు గురై ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న రెండు ఫైర్ ఇంజన్ సాయంతో రాజేంద్రనగర్ ఫైర్ అధికారులు మంటలనజ అదుపులోకి తెచ్చారు.



# బై బై గణేశా...

**ఆమనగల్లు, మహా :** వినాయక చవితి పర్వదినం సందర్భంగా పలు మండలం లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు ఆదివారం ప్రత్యేకంగా పూజలు నిర్వహించి వైభవంగా నిమజ్జనం చేశారు. విగ్రహాలను ఉత్సవ కమిటీ వారు యువకుల కేరింతల నడుమ బాణసంచా పేల్చుకుంటూ, డిజే నృత్యాలతో, జై బోలో గణేష్ మహారాజ్ కి అంటూ వివిధ గ్రామాల సమీపాల్లోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. మేళతాళాలు, చెక్కభజనలు, పోతురాజుల విన్యాసాల నడుమ పట్టణంలో ఊరేగించి ఘనంగా నిమజ్జనం చేశారు. అడుగడుగునా ఊరేగింపులోని విగ్రహాలకు హారతి కర్పూరాలతో నీరాజనం పలికారు. విగ్రహాలు ఉంచిన వాహనాల ఊరేగింపు ముందు భాగం లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా అమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల పోలీసులు ముందు జాగ్రత్తలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జనం జరిగే ప్రాంతాలను ఆయా మండలాల అధికారులు పరిశీలించారు.



# ప్రైవేట్ టీచర్స్ ఫెలిసిటేషన్ కార్యక్రమం

## పాల్గొన్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య




**హన్మకొండ మహా;** హనుమకొండ నగరం లోని రాఘవేంద్ర కన్వెన్షన్ లో తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రైవేట్ టీచర్స్ ఫెలిసిటేషన్ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టీచర్ లతో కలిసి ఎంపీ బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనది అని అన్నారు. విద్యార్థులను అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రైవేట్ టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తమ వ్యక్తిగత విజయానికి కాకుండా విద్యార్థుల, సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రైవేట్ టీచర్లు ఏకమై సంస్థగా తమ హక్కుల కోసం పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో కడియం రామచంద్రయ్య, కూర వెంకట్, ముజీబ్ ఖాన్, ప్రెసిడెంట్ ఫర్జానా తాసీమ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత సామూహిక వివాహాల పోస్టర్ విడుదల

## తిలక్ వాకర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో సామూహిక వివాహాల నిర్వహణ

### పోస్టర్ను విడుదలచేసిన వేమనపల్లి.. మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్ కుమార్



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలోని తిలక్ వాకర్స్ వెల్ఫేర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో బెల్లంపల్లి నియోజకవర్గం లో ఉన్న అన్ని గ్రామాల నిరుపేద యువతి యువకులకు ఉచిత సామూహిక వివాహాలు కొరకు తేది అక్టోబర్ 1 లోగ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వేమనపల్లి మండలంలో నిర్వహించిన సదస్సులో పోస్టర్ను వేమనపల్లి మాజీ జడ్పిటిసి సభ్యుడు రుద్రభట్ల సంతోష్ ఆదివారం నాడు విడుదల చేశారు.ఈ సందర్భంగా తిలక్ వాకర్స్ అసోసియేషన్ నిర్వాహకులు మాట్లా డుతూ బెల్లంపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నిరుపేద యువతీ యువకులకు ఉచితంగా సామూహిక వేదికను ఏర్పాటు చేసి వివాహాలను జరిపించడం జరుగుతుందని అందుకు స్థానిక నాయకులు, గ్రామీణులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చైతన్యం పరచాలని సదుద్దేశంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 26 రోజు బెల్లంపల్లిలో బూద గెస్ట్ హౌస్ రోడ్ లో శివాలయంలో వివాహ మహోత్సవం ను ఏర్పాటు చేయడమైందని వెల్లడించారు. ఈకార్యక్రమంలోతిలక్వాకర్స్వెల్ఫేర్అసోసియేషన్ సభ్యులు గెల్లి జయరాం, రంగ రామన్న, బోగే శ్రీనివాస్, నాగుల లింగయ్య, ఏనుగు నరేష్, మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ సాబీర్అలీ, మండల యూత్ కాంగ్రేస్ అధ్యక్షులు ముల్కల్ల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఆకుల లింగా గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ ఒడిలా రాజన్న, ఆత్రం గణపతి, మాజీ కో అప్టెడ్ సభ్యులు జహీద్అలీ, మాజీ ఎంపీటీసీ అదే శంకర్, మాజీ సర్పంచులు గాలి మధు, తోకల రాంచందర్, కుబిడే కిష్టయ్య, ఇగురం జగన్,మోర్ల రమేష్ లు పాల్గొన్నారు.

# వరద నీటిలో నిలిచిపోయిన బస్సు

## ప్రయాణికులను కాపాడిన ఇన్స్ స్పెక్టర్ ఎంఏ షుకూర్



**వరంగల్ మహా;** వరంగల్ నగరంలో ఆదివారం తెల్లవారుజామున దాదాపు రెండు గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. ఈ భారీ వర్షం కారణంగా వరంగల్ ప్రాంతాల్లోని అండర్ బ్రిడ్జి కింద భారీగా వర్షం నీరు చేరుకోవడంతో బస్సు ఒక్కసారిగా ఈ నీటిలో బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న ఇంతేజార్గంజ్ ఇన్స్ స్పెక్టర్ ఎంఏ షుకూర్ వెంటనే తన సిబ్బందితో కలిసి తాళ్ల సహాయంతో ప్రయాణికులకు సురక్షింతంగా బయటకు తీసుకువచ్చారు. సకాలంలో స్పందించిన ఇన్స్పెక్టర్ కు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా నగరంలో కురిసిన కుండపోత వర్షానికి కొన్ని ప్రాంతాలు అంతా జలమయం అయ్యాయి. దీంతో డిఆర్ఎఫ్ బృందం రంగంలోకి దిగి పలుచోట్ల సహాయక చర్యలు చేపట్టి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

## కమిషనరేట్ పరిధిలో ప్రశాంతంగా

# ముగిసిన గణేష్ నిమజ్జనం

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**హన్మకొండ మహా;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిమజ్జన ప్రక్రియ పూర్తి చేసినట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. శుక్రవారం ప్రారంభమైన ఈ నిమజ్జన కార్యక్రమం ఆదివారం చిన్న వడ్డేపల్లి చెరువులో చివరి గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేయడంతో నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. ఈ ఏడాది వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 6619 విగ్రహాలు నిమర్జనం కాగా ఇందులో సెంట్రల్ జోన్ పరిధిలో 2766, ఈస్ట్ జోన్ పరిధిలో 2190, వెస్ట్ జోన్ పరిధిలో 1963 గణేష్ విగ్రహాలు వివిధ చెరువుల్లో నిమజ్జనం చేయబడ్డాయి. నిమజ్జన కార్యక్రమంలో భాగంగా శోభా యాత్రలను ప్రశాంతంగా నిర్వహించేందుకు క్షేత్ర స్థాయిలో శ్రమించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి పోలీస్ కమిషనర్ అభినందనలు తెలియజేస్తూ, అలాగే ఇతర ప్రభుత్వ విభాగాలకు అధికారులు, సిబ్బంది పని అభినందనీయమని. ముఖ్యంగా పోలీసుల నిబంధనలు పాటిస్తూ నవరాత్రి, నిమర్జనం కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి కావడంలో పూర్తి స్థాయిలో సహకరించిన గణేష్ నవరాత్రి నిర్వాహకులు, అన్ని వర్గాల ప్రజలకు వరంగల్ పోలీస్ కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు.

# అందరికి ధన్యవాదాలు -ఎస్పీ



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లాలోని గణపతి నవరాత్రి ఉత్సవాలు శనివారం నిమజ్జనంతో ప్రశాంతంగా ముగిసినట్టు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఇందుకు శ్రమించిన జిల్లా పోలీసు యంత్రాంగం, జిల్లా అధికార యంత్రాంగానికి ధన్యవాదాలు తెలుపుతూ ప్రశాంతంగా నవరాత్రి ఉత్సవాలను పూర్తి చేయడానికి సహకరించిన జిల్లా ప్రజలు, గణపతి మండపాల నిర్వాహకులు, హిందూ సంఘాల నాయకులందరికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి సంస్కృతి ప్రతి ఏటా కొనసాగాలని కోరారు. అదేవిధంగా 11 రోజులపాటు 24 గంటలు శ్రమించిన పోలీసు సిబ్బంది సివిల్, రిజర్వ్, హోంగార్డ్ సిబ్బంది, స్పెషల్ పార్టీ, క్యూఆర్టి వారికి అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా 150 మంది ఎన్సిసి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సక్రమంగా విధులు నిర్వర్తించి తమ వంతు పాత్ర పూర్తి చేసినందుకు అభినందనలు తెలియజేశారు

## జాతీయ మాల మహానాడు మంథని నియోజకవర్గం ఇంచార్జీగా

# కందుగుల రాజన్న నియామకం



**కాటారం, మహా :** జాతీయ మాల మహానాడు జాతీయ అధ్యక్షులు అద్దంకి దయాకర్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో కాటారం మండలంకు చెందిన కందుగుల రాజన్న ను మంథని నియోజకవర్గం ఇంచార్జ్ గా నియమించారు. నూతనంగా నియమితులైన రాజన్నకు మంథని పట్టణంలోని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ మాల మహానాడు కమ్యూనిటి హాల్ లో రాష్ట్ర ఉపాధ్యక్షులు నూకల బాణయ్య చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కందుగుల రాజన్న మాట్లాడుతూ... ఈ నెల 8 సోమవారం రోజున మంథని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాల సామాజిక వర్గానికి జరిగిన రోస్టర్ విధానం రద్దు చేయాలని వినతి పత్రం అందజేయడం జరుగుతుందని అన్నారు. త్వరలో జాతీయ మాల మహానాడు నియోజకవర్గం, డివిజన్, మండల కమిటిలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నాయకులు అప్పాల పోచమల్లయ్య, టీం అధ్యక్షులు నూకల శంకర్, మండల అధ్యక్షులు జంజర్ల రాజు, ఎరుకల ప్రవీణ్, బండి రాజయ్య, కొప్పూరి రాజలింగు, కొప్పూరి వేణు ప్రసాద్, పసుల పోచయ్య, బొడ్డేల్లా రవి, ఆర్ల జ్ఞాని, డికొండ లక్ష్మణ్, జంజర్ల శ్రీనివాస్, ఆర్ల సందీప్, లింగాల సురేష్, నవ రమేష్, రావుల మొగిలి, వెంకటేష్ లు పాల్గొన్నారు.

## దేశంలో జర్నలిస్టుల హక్కుల సాధనలో

# ముందంజలో ఎన్ యుజె(ఐ)

## విజయవంతంగా ముగిసిన జాతీయ మహాసభలు




**వరంగల్ మహా;** దేశంలో జర్నలిస్టుల హక్కుల సాధనలో ఎన్ యుజె(ఐ) ముందుందని నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) ప్రతినిధులు ప్రకటించారు. ఎన్ యుజె(ఐ) జాతీయ కార్యవర్గ సమావేశాలు శని ఆదివారాలలో విజయవాడలో ఎన్ యుజె(ఐ) జాతీయ అధ్యక్షుడు సురేష్ శర్మ అధ్యక్షతన జరిగాయి. ఎన్ యుజె(ఐ) సెక్రటరీ జనరల్ త్రియుగ్ నారాయణ తివారీ, జాతీయ కార్యదర్శి మెరుగు చంద్రమోహన్, టీఎస్ జెయు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగౌని, వరంగల్ నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..., దేశంలో జర్నలిస్టులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా జర్నలిస్టుల రక్షణ కోసం సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. మీడియా స్వేచ్ఛపై ప్రజల్లో అవగాహన రావాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. మీడియా స్వేచ్ఛను హరించే శక్తుల పట్ల ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని తీర్మానించారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాను కలిపి విస్తృతమైన అధికారాలతో కేంద్ర ప్రభుత్వం మీడియా కౌన్సిల్ ను ఏర్పాటు చేయాలని

# ఖేల్ కూద్ పోటీలు

**ఆదిలాబాద్ మహా :** సంస్కృతీ నిలయంగా భావించే సరస్వతి శిశుమందిరాల్లో చదివే విద్యార్థులకు విద్యాపీఠం ఆధ్వర్యంలో బోధనతో పాటు బోధనేతర అంశాల్లో తర్ఫీదులనిస్తూ వారిని నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నామని సరస్వతి విద్యాపీఠం తెలంగాణ ప్రాంత శైక్షణిక్ ప్రముఖ్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్య తెలిపారు. ఇందులో భాగంగానే విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలకు మెరుగులద్దేలా ఈనెల 8, 9, 10వ తేదీల్లో మూడు రోజుల పాటు రాష స్థాయి వ్యక్తిగత స్పర్ద ఖేల్ కూద్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. పట్టణంలోని పాతహౌజింగ్ బోర్డు సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే ఈ పోటీల్లో వ్యక్తిగత క్రీడలైన పరుగుపందెం, హైజంప్, లాంగ్ జంప్, జావెలిన్ త్రో తదితర అంశాలుంటాయన్నారు. ఈ పోటీలకు తెలంగాణలోని 33 జిల్లాల నుంచి 450 మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలియజేశారు. ఇక్కడ విజేతలైన వారికి క్షేత్రస్థాయి అందులో విజేతలకు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

# నిర్మల్ జిల్లాలో చోరీ



**నిర్మల్ మహా :** జిల్లాలో దొంగలు గుడులను టార్గెట్ చేసారు. అధికారులు ప్రజలు అందరూ వినాయక నిమజ్జనాల్లో నిమగ్నమై ఉండడంతో సందట్లో సడేమియాలా చోరులు గుళ్లో చొరబడ్డారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణ కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గాయత్రి మాత ఈశ్వరి దేవి విగ్రహాలపై నుండి బంగారు ఆభరణాలు కాజేసి హుండీ ఎత్తుకెళ్ళారు. తర్లపాడ్ గ్రామంలోని ఓం కారేశ్వర,అగ్గిమల్లన్న దేవాలయంలోనూ దొంగలు తమ చేతి వాటం ప్రదర్శించారు. దేవాలయంలో ఉన్న సీసీ కెమెరా ధ్వంసం చేసి ఏమీ దొరకక పోవడంతో డీవీఆర్ రూటర్ అపహరించారు. మొత్తం మూడు ఆలయాలలో కలిపి లక్ష వరకు చోరీ అయ్యిందని ఆయా ఆలయాల కమిటీ సభ్యులు తెలిపారు.

# రికార్డ్ స్థాయిలో సుమారు 7 వేల విగ్రహాల నిమజ్జనం

## జిల్లా యంత్రాంగం కృషి అభినందనీయం.. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ మహా;** ఈ సంవత్సరం వరంగల్ నగరంలోని గణేష్ నిమజ్జనం చెరువు ప్రాంతాల్లో వరంగల్ జిల్లా యంత్రాంగం తరపున అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది. అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిమజ్జన కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం ముగించడం జరిగిందని జిల్లా యంత్రాంగం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత సంవత్సరం నిమజ్జనంలో సుమారు (4500) విగ్రహాల తో పోలిస్తే ఈ సంవత్సరం రికార్డ్ స్థాయిలో 7 వేల పై చీలుకు విగ్రహాల నిమజ్జనం జరిగింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లాకు సంబంధించి సాయంత్రం 3.00 గంటల వరకు నిమజ్జన ప్రక్రియ పూర్తయిందని ఆకస్మికంగా సాయంత్రం హనుమకొండ జిల్లాకు సంబంధించిన రెడ్డి కాలనీ తోపాటు ఓ స్వీట్ యజమానికి చెందిన విగ్రహాలు నిమజ్జనానికి దేశాయిపేట చిన్న వడ్డేపల్లి చెరువుకు రాగా, వాటిని కూడా అధికారులు సిబ్బంది దగ్గర ఉండి ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నారని ఈ సందర్భంగా వారు తెలిపారు. కాగా కొన్ని ప్రచార మాధ్యమాలలో వరంగల్ జిల్లాకు సంబంధించిన విగ్రహాలు శనివారం సాయంత్రం నిమజ్జన చేసే క్రమంలో క్రేన్ల తో పాటు సిబ్బంది కూడా అందుబాటులో లేరని ప్రచారం జరిగిందని అందులో వాస్తవం లేదని పక్క జిల్లా నుండి వచ్చిన రెండు విగ్రహాలను కూడా నిమజ్జనం చేయడం జరిగిందని జిల్లా అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లా యంత్రాంగానికి, ఆయా విభాగాల అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# కవయిత్రికి పురస్కారం



**ఆదిలాబాద్ మహా :** ప్రముఖ తత్త్వకవి ఉదారి నాగదాసు స్మారక కవితా అవార్డు ప్రదానోత్సవం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ మీటింగ్ హాల్ లో ఘనంగా జరిగింది. ప్రముఖ కవయిత్రి తోట నిర్మలారాణి అవార్డు ను అందుకున్నారు. ఉదారి కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రతీ సంవత్సరం ఒక సాహితీవేత్తకు స్మారక అవార్డ్ ప్రదానం చేస్తున్నారు. అవార్డుకు తనను ఎంపిక చేయడం పట్ల కవయిత్రి నిర్మలా రాణి నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షులు కొండి మల్లారెడ్డి, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ సంగీత, నిర్మల్ జిల్లా తెరవే అధ్యక్షులు నేరెళ్ల హన్మంతు కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.



# రేగొండలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆర్చి గేటును ప్రారంభించిన ఎమ్మెల్యే

**భూపాలపల్లి, మహా :** భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో ఆదివారం చిట్యాలకు వెళ్లే రోడ్డులో ఆర్చ్ గేట్ ను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వస్వాగత తోరణం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై ప్రారంభించారు. ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, భక్తుల సౌకర్యార్థం కొడవటంచ ఆలయంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. భక్తుల సహకారంతో ఆలయాన్ని మరింత వైభవంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కొడవటంచ ఆలయ చైర్మన్ బిక్షపతి, ఈవో మహేష్ , భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్, ఉమ్మడి రేగొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, కాంగ్రెస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్యాశాఖ పటిష్టం



## ఎమ్మెల్యే సత్యనారాయణ రావు

**భూపాలపల్లి, మహా :** సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అభివృద్ధికి పెద్ద పీట వేస్తోందని విద్యాశాఖ బలోపేతం చేస్తున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గాంధీనగర్(భూపాలపల్లి) మహాత్మా జ్యోతిభాపూలే పాఠశాల(బాలికలు)ను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమ్మెల్యే విద్యార్థుల తరగతి గదుల్లో తిరుగుతూ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కాంపౌండ్ గోడ, సీసీ కెమెరాలు, గ్రౌండ్ లెవలింగ్, బెంచీలు, డైనింగ్ హాల్ తదితర సమస్యలను సకాలంలో పూర్తి చేసేలా చూస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యలన్నీ విన్న ఎమ్మెల్యే అట్టి అన్ని పనులను సకాలంలో పూర్తి చేసేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వసతి గృహాల్లో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు భోజనాన్ని అందించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. అందులో భాగంగానే విద్యార్థులకు మెస్ చార్జీలతో పాటు కాస్మోటిక్ ఛార్జీలను కూడా పెంచినట్లు ఎమ్మెల్యే గుర్తుచేశారు. విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలని సూచించారు.

# కుదురుపల్లి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు


## దగ్ధమైన ఆస్తి



**కాటారం, మహా :** మహాదేవపూర్ మండలం లోని కుదురుపల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున చల్ల దేవేందర్ ఇంట్లో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది.తీవ్రంగా ఆస్తి నష్టం సంభవించినట్లు తెలిపారు. అగ్న ప్రమాదంతో రూ 2లక్షల ఆస్తినష్టం సంభవించినట్లు బాధితుడు తెలిపారు.ఇంట్లో అగ్నిమంటలు చెలరేగి తను జీవనోపాధిగా నడుపుకుకుంటున్న పిండి గిర్ని,కారం గిర్ని ,బియ్యం గిర్ని తో పాటు వాటిని నడిపే మోటార్,ఇంటికి ఉన్న దర్వాజ,కుర్చీలు,రేకులు,వరుకు కవరు పట్టాలు,కరెంటు తీగలు పనికి రాకుండా కాలిపోయినట్లు తెలిస్తారు. గిర్నీలు కాలి పోవడం వలన రోజు వారిగా తన జీవనోపాధి కుటుంబాన్ని పోషించుకోవడం ఆగమ్యాగోచరంగా మారిందని అగ్నిప్రమాదంతో రోడ్డున పడ్డానని,నా కుటుంబాన్ని నన్ను ఆదుకోవాలని బాధితుడు చల్లా దేవేందర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# 99 శాతం నిరుద్యోగులవుతారు.. ప్లాన్ బి ఉండదు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) చాలా రంగాల్లో ఉద్యోగాలను భర్తీ చేస్తుందని, తద్వారా నిరుద్యోగుల సంఖ్య ఎక్కువవుతుంది పలువురు నిపుణులు చెబుతూనే ఉన్నారు. ఇప్పుడు తాజాగా లూయిస్‌విల్లే యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ 'రోమన్ యాంపోల్స్కీ' సంచలన వ్యాఖ్యలు చేశారు. రోమన్ యాంపోల్స్కీ ప్రకారం.. కృత్రిమ మేధస్సు (AI) 2030 నాటికి 99 శాతం మంది కార్మికులను నిరుద్యోగులుగా చేస్తుందని అన్నారు. ప్రపంచంలోని చాలా కంపెనీలు తమ ఖర్చులను తగ్గించుకోవడానికి.. ఆదాయాన్ని పెంచుకోవడానికి ఏఐ వ్యవస్థలనే ఉపయోగించుకుంటారని హెచ్చరించారు. కోడింగ్ ఉద్యోగులు, ప్రాంప్ట్ ఇంజనీర్లు మాత్రమే కాకుండా.. చాలా రంగాల్లోని ఉద్యోగాలని ఏఐ భర్తీ చేస్తుంది. మనం ఇంతకు ముందు ఎన్నడూ చూడని స్థాయిలో నిరుద్యోగం ఉన్న ప్రపంచాన్ని చూడబోతున్నాము. నేను 10 శాతం నిరుద్యోగం గురించి చెప్పడం లేదు. 99 శాతం ఉద్యోగాలు కోల్పోతారని చెబుతున్నానని ప్రొఫెసర్.. ది డైరీ ఆఫ్ ఎ సిఇఓ పాడ్‌కాస్ట్‌లో పేర్కొన్నారు. 2027 నాటికి 'ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్' (ఏజీఐ) వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఏజీఐ వచ్చిన మూడేళ్ళ తరువాత.. ఏఐ సాధనాలు, హ్యూమానాయిడ్ రోబోలు వస్తాయి. కంపెనీలు మనుషులకు ప్రత్యామ్నాయంగా వీటిని నియమించుకునే అవకాశం ఉందని అన్నారు. దీనివల్ల కార్మిక మార్కెట్ కూలిపోతుందని చెప్పారు. "అన్ని ఉద్యోగాలు ఆటోమేటెడ్ అవుతాయి, అప్పుడు 'ప్లాన్ బి' ఉండదు. మీరు తిరిగి శిక్షణ పొందలేరు" అని రోమన్ యాంపోల్స్కీ అన్నారు.





# మా దేశం వచ్చేయండి.. శాశ్వతంగా ఉండిపోండి!

బ్రెజిల్ ఇప్పుడు విదేశీయులకు పర్మినెంట్ రెసిడెన్సీ పొందే అవకాశాన్ని కల్పిస్తోంది. దీని కోసం భారతీయులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. దీని కింద ఆ దేశంలో శాశ్వతంగా నివసించడానికి, పనిచేయడానికి, చదువుకోవడానికి అవకాశం లభిస్తుంది. బ్రెజిల్ లో స్థిరపడాలనుకునే వారికి ఈ పథకం మంచిదే అయినా అందుకు అవసరమైన కొన్ని అర్హతలు, నియమాలు ఉన్నాయి. బ్రెజిల్ దాని అందం, గొప్ప సంస్కృతికి ప్రసిద్ధి చెందింది, కానీ ఇప్పుడు ఈ దేశం విదేశాల్లో నివసించడానికి, పనిచేయడానికి, చదువుకోవడానికి ఇష్టపడేవారికి మంచి ఎంపికగా మారింది. బ్రెజిల్ శాశ్వత నివాస కార్యక్రమాన్ని ప్రారంభించింది, దీని ధర భారతదేశంలో సుమారు రూ.27,000, భారతీయ పౌరులు కూడా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

**శాశ్వత నివాసానికి మార్గాలు**

బ్రెజిల్ లో శాశ్వత నివాసం పొందడానికి అనేక మార్గాలు ఉన్నాయి. అత్యంత సాధారణ మార్గం బ్రెజిల్లో వ్యాపారం లేదా స్థిరాస్తిలో పెట్టుబడి పెట్టడం. ఇది కాకుండా, ఎవరైనా బ్రెజిల్లో ఉద్యోగం కలిగి ఉండి, ఉద్యోగంలో కొనసాగితే శాశ్వత నివాసాన్ని కూడా పొందవచ్చు. బ్రెజిల్ లో వివాహం ద్వారా లేదా పిల్లలను కనడం ద్వారా కూడా రెసిడెన్సీ పొందే అవకాశం ఉంది. రిటైర్మెంట్ తర్వాత రెగ్యులర్ పెన్షన్ పొందితే కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తంమీద, నెలకు సుమారు 2,000 అమెరికన్ డాలర్ల ఆదాయం ఉన్నవారు తాత్కాలిక నివాసానికి అర్హులు కావచ్చు, తరువాత దీనిని శాశ్వత నివాసంగా మార్చవచ్చు. శాశ్వత నివాసానికి దరఖాస్తుదారు చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికేట్, లీగల్ ఎంట్రీ అండ్ స్టే రుజువు, ఉద్యోగం లేదా పెట్టుబడి పత్రాలు వంటి కొన్ని అవసరమైన పత్రాలను సమర్పించాలి. అంతేకాకుండా, రెసిడెన్సీ హోదాను కొనసాగించడానికి వరుసగా రెండు సంవత్సరాలకు మించి బ్రెజిల్ వెలుపల ఉండకూడదు. బ్రెజిల్ లో నివసించడం ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ, కొన్ని ప్రదేశాలలో జీవన వ్యయం ఎక్కువగా ఉంటుంది. అలాగే, పన్ను రేట్లు ఎక్కువగానే ఉంటాయి. జాబ్ మార్కెట్ చాలా పోటీగా ఉంటుంది. అన్నిటికంటే ముఖ్యమైనది అక్కడ ప్రధాన భాష అయిన పోర్చుగీస్ పరిజ్ఞానం.

**దరఖాస్తు ఫీజు రూ.27 వేల లోపే**

దరఖాస్తు ప్రక్రియ చాలా సులభం. ముందుగా పెట్టుబడి లేదా ఉపాధిని బట్టి సంబంధిత వీసాకు సంబంధించిన డాక్యుమెంట్లను సిద్ధం చేసుకోవాలి. ఆ తర్వాత ఆన్‌లైన్లో లేదా బ్రెజిల్ రాయబార కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలి. దరఖాస్తు ఫీజు 100 నుంచి 300 డాలర్ల వరకు ఉంటుంది. అంటే రూ.27 వేల లోపే. దరఖాస్తు ఆమోదించిన తర్వాత, దరఖాస్తుదారు బ్రెజిల్ ఫెడరల్ పోలీసుల నుండి శాశ్వత నివాస ఐడీ కార్డును అందుకుంటారు. మొత్తం ప్రక్రియకు 46 నెలలు పట్టవచ్చు.

# జీఎస్టీ 2.0 ఎఫెక్ట్..

## రూ.2 లక్షలు తగ్గిన ఫేమస్ కారు ధర

జీఎస్టీ సమావేశం తరువాత వచ్చిన ప్రతిపాదనలు.. కార్ల రేట్లను తగ్గేలా చేశాయి. సెప్టెంబర్ 22 నుంచి కొత్త జీఎస్టీ అమలులోకి వస్తుంది. ఈ తరుణంలో హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (HMIL) తన వాహనాల ధరలు భారీగా తగ్గుతాయని.. కొత్త ధరలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించింది. ప్యాసింజర్ వాహనాలపై జీఎస్టీ తగ్గింపు.. వినియోగదారులకు ప్రయోజనాన్ని కలిగిస్తుంది. దీంతో భారతదేశం అంతటా ఉన్న హ్యుందాయ్ కస్టమర్లు తమకు ఇష్టమైన హ్యుందాయ్ మోడళ్లను మరింత అందుబాటులో ఉన్న ధరలకు కొనుగోలు చేయగలరు. ఈ పండుగ సీజన్‌లో బ్రాండ్ కార్ల సేల్స్ పెరుగుతాయి. ప్యాసింజర్ వాహనాలపై జీఎస్టీ తగ్గించడానికి.. భారత ప్రభుత్వం తీసుకున్న దూరదృష్టితో కూడిన చర్యను మేము హృదయపూర్వకంగా అభినందిస్తున్నామని.. హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ 'అన్సూ కిమ్' అన్నారు. ఈ సంస్కరణ ఆటోమోటివ్ పరిశ్రమకు ప్రోత్సాహాన్ని ఇస్తుంది. భారతదేశం వికసిత్ భారత్ మార్గంలో పాయిస్తున్నప్పుడు.. ఆటోమొబైల్ రంగం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. జీఎస్టీ 2.0 అమలుతో.. హ్యుందాయ్ టక్సన్ కారు ధర గరిష్టంగా రూ. 2,40,303 వరకు తగ్గింది. గ్రాండ్ ఐ10 నియోస్ ధర రూ. 73,808 తగ్గింది. మోడల్ వారీగా తగ్గిన



ధరలు ఎలా ఉన్నాయంటే..

- గ్రాండ్ ఐ 10 నియోస్: రూ.73,808
- ఆరా: రూ.78,465
- ఎక్స్టర్: రూ.89,209
- ఐ20: రూ.98,053
- ఐ20 ఎన్ లైన్: రూ.1,08,116
- వెన్యూ: రూ.1,23,659
- వెన్యూ ఎన్ లైన్: రూ.1,19,390
- వెర్నా: రూ.60,640
- క్రెటా: రూ.72,145
- క్రెటా ఎన్ లైన్: రూ.71,762
- అల్కాజార్: రూ.75,376
- టక్సన్: రూ.2,40,303

# అమెరికాతో కలిసి పనిచేయాలి

## అశ్విని వైష్ణవ్


**మహా:** అమెరికా అధ్యక్షుడు 'డొనాల్డ్ ట్రంప్' ఇండియన్ ఔట్‌సోర్సింగ్ కంపెనీలపై కఠినమైన చర్యలు తీసుకుంటున్న సమయంలో కేంద్ర మంత్రి 'అశ్విని వైష్ణవ్' కీలక వ్యాఖ్యలు చేశారు. సుమారు 300 బిలియన్ డాలర్ల విలువైన భారతదేశ ఐటీ పరిశ్రమను కాపాడుకోవడానికి అమెరికాతో కలిసి పనిచేయాలని, ఇతర మల్టీనేషనల్ కంపెనీలతో కూడా టచ్‌లో ఉండాలని ఆయన పేర్కొన్నారు. భారతీయ ఐటీ రంగాన్ని మాత్రమే కాకుండా.. ఎలక్ట్రానిక్స్, తయారీ రంగాలను కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, దీనికి కావలసిన చర్యలను కేంద్రం తీసుకుంటోందని మంత్రి అన్నారు. ఇటీవల కాలంలో స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో ఇండియా వాటా గణనీయంగా పెరిగిందని ఆయన వివరించారు. మేము ఇప్పటికే అమెరికా, యూరప్, జపాన్, ఆగ్నేయాసియా ప్రభుత్వాలతో కూడా సంప్రదింపులు జరుపుతున్నాము. భారతదేశంలోని పరిశ్రమలు శక్తివంతంగా ఉంచడమే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నట్లు అశ్విని వైష్ణవ్ సూచించారు. 5.67 మిలియన్లకు పైగా ఉద్యోగులను కలిగి ఉన్న, ఎగుమతి ఆదాయాలకు గణనీయంగా దోహదపడే భారతదేశ ఐటీ సేవల రంగం చాలా కాలంగా విదేశీ క్లయింట్లపై, ముఖ్యంగా అమెరికాలోని క్లయింట్లపై ఆధారపడింది. దేశంలో ఉద్యోగాలను రక్షించడం, కొత్త అవకాశాలను పెంచడం.. రెండింటినీ లక్ష్యంగా చేసుకుని ప్రస్తుత ఐటీ ఉపాధిని కాపాడటం, దేశీయ తయారీని పెంచడమే ప్రభుత్వం లక్ష్యం అని అశ్వని వైష్ణవ్ అన్నారు. 2025 ఆర్థిక సంవత్సరంలో పరిశ్రమ ఆదాయం 5.1 శాతం పెరిగి 282.6 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని నాస్కామ్ అంచనా. ఇందులో టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, విప్రో వంటి కంపెనీలు ఉన్నాయి. ఈ కంపెనీలకు వచ్చే ఆదాయంలో సుమారు 60 శాతం యూఎస్ నుంచే లభిస్తోంది.






# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL



# 11 ఏళ్ల బాలికకు శిశు జననం.. 31 ఏళ్ల వివాహితుడు అరెస్ట్

**బరేలీ:** దేశంలో బాలికలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు అంతులేకుండా పోతోంది. ఇటువంటి నేపథ్యంలో బాధితుల పరిస్థితి వర్ణనాతీతంగా మారుతోంది. తాజాగా వివాహితుని చేతిలో అత్యాచారానికి గురైన ఒక మైనర్ బాలిక శిశువుకు జన్మనిచ్చింది. అయితే ఆ శిశువు పుట్టిన 30 నిమిషాలకే కన్నుమూసింది. బాధిత చిన్నారి తనకు కడుపు నొప్పి వస్తున్నదంటూ తరచూ తల్లిదండ్రులకు చెప్పేది. ఈ నేపథ్యంలో బాలిక కుటుంబ సభ్యులు ఆమెను గురువారం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లిన తర్వాత బాలిక గర్భిణి అనే విషయం వెలుగు చూసింది. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో చోటు చేసుకుంది. బాలికకు ఏడవ నెలలోనే శిశు జననం జరిగింది. శిశువు పుట్టిన 30 నిముషాలకే కన్నుమూసింది. ఈ ఘటనలో బాధిత చిన్నారిని బెదిరించి, పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన యూపీలోని బరేలీకి చెందిన రషీద్(31)ను పోలీసులు అరెస్టు చేశారు. ఇద్దరు పిల్లల తండ్రి అయిన రషీద్ ఏడు నెలల క్రితం బాధిత చిన్నారికి పండు ఇస్తానని చెప్పి, తన ఇంటికి పిలిచాడు. ఆ తర్వాత చిన్నారిపై అత్యాచారం చేసి, ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. తరువాత తరచూ చిన్నారిపై అత్యచారం చేస్తూ వచ్చాడు. తాజాగా బాధితురాలిని కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకువెళ్లినప్పుడు, అల్ట్రాసౌండ్ పరీక్షలో బాధిత చిన్నారి ఏడు నెలల గర్భిణి అని వెల్లడైంది. దీంతో బాలికను జిల్లా మహిళా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చిన్నారి అదే రోజు ఒక బిడ్డకు జన్మనిచ్చింది. ఈ నేపథ్యంలో బాలిక ఆరోగ్య పరిస్థితి విషమించింది. తరువాత నెమ్మదిగా కుదుటపడిందని వైద్యులు తెలిపారు. అయితే బాలికకు జన్మించిన శిశువు మృతిచెందింది. ఈ ఘటనను ధృవీకరించిన



నవాబ్‌గంజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ అరుణ్ కుమార్ శ్రీవాస్తవ మీడియాతో మాట్లాడుతూ, నిందితుడు రషీద్‌పై కేసు నమోదయ్యిందని, దర్యాప్తు జరుగుతున్నదని తెలిపారు.



# బర్త్ డే పార్టీ చేస్తామని పిలిచి.. మహిళపై గ్యాంగ్ రేప్!

**కోల్‌కతా:** ప్రస్తుత రోజుల్లో ఎవర్ని నమ్మాలో, ఎవర్ని నమ్మకూడదో అర్థం కావడం లేదు. చుట్టూ ఉన్న జనం మంచిగా ఉంటున్నారని వారు మనకి అండగా ఉంటారనుకోవడానికి లేదు. వెనకాల గోతులు తీసేవాళ్లు, అవకాశం వస్తే తమ అవసరాలు తీర్చుకునే వాళ్లు ఉంటారనేది గ్రహించాలి. తాజాగా జరిగిన ఘటన అందుకు అద్దం పడుతుంది. తెలిసిన వ్యక్తులే కదా అని నమ్మి వెళ్లిన ఓ మహిళకు చేదు అనుభవం ఎదురైంది. ఆమె బర్త్ డే రోజున.. పుట్టిన రోజు తాము చేస్తామని నమ్మబలికిన ఇద్దరు ప్రబుద్ధులు.. సదరు మహిళపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడ్డారు. ఈ ఘటన పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతాలో చోటు చేసుకుంది. శుక్రవారం(సెప్టెంబర్ 5వ తేదీ) జరిగిన సామూహిక అత్యాచారం ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

వివరాల్లోకి వెళితే.. కోల్‌కతా నగర పొలిమేర ప్రాంతమైన రీజెంట్ పార్క్ ఏరియాలో ఉంటున్న చందన్ మాలిక్, దీప్ అనే ఇద్దరు వ్యక్తులు తమకు తెలిసిన ఒక మహిళను బర్త్ డే సెలబ్రేషన్స్ చేస్తామని నమ్మబలికారు. ఆమె వారిని నమ్మడంతో దీప్ ఇంటికి తీసుకెళ్లారు. వారు ముగ్గురు కలిసి భోజనం చేసిన తర్వాత ఇంటికి వెళతానని ఆమె చెప్పడంతో గది తలుపులు మూసివేశారు నమ్మక ద్రోహాలు ఆపై ఆమెపై సామూహిక అత్యాచారం చేశారు. అనంతరం వారు అక్కడ నుంచి పరారయ్యారు. ఇందులో దీప్ అనే వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగిగా తెలుస్తోంది. దీనిపై ఆమె ఇంటికి తిరిగి వచ్చి కుటుంబ సభ్యులకు విషయం చెప్పడంతో వారు పోలీసుల్ని ఆశ్రయించారు. పోలీసుల ఫిర్యాదు మేరకు ఆ నిందితులు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం పరారీలో ఉన్న వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. కొన్ని నెలల క్రితం తనకు చందన్ అనే వ్యక్తి పరిచయమయ్యాడని, అతని తనను కోల్‌కతా దుర్గా పూజా కమిటీలో హెడ్‌గా చెప్పుకొచ్చాడు. ఆ క్రమంలోనే దీప్‌ను చందన్ పరిచయం చేశాడని ఫిర్యాదులో ఆమె పేర్కొంది. తనను పూజా కమిటీలో జాయిన్ చేస్తానని వారు ప్రామిస్ చేశారని, అలా తమ మధ్య పరిచయం ఏర్పడిందని 20 ఏళ్ల బాధిత మహిళ పేర్కొంది. తన బర్త్ డే సందర్భంగా తనను ఆ వేడుకలు చేస్తామని పిలిచి ఇలా అత్యాచారానికి పాల్పడ్డారని ఫిర్యాదులో స్పష్టం చేసింది. జూన్ 25వ తేదీన కోల్‌కతాలో లా స్టూడెంట్ అత్యాచారానికి గురైన సంగతి తెలిసిందే. మనోజిత్ మిశ్రా అనే వ్యక్తి లా విద్యార్థినిపై అత్యాచారానికి ఒడిగట్టాడు. తాజా సంఘటనతో కోల్‌కతా నగరంలో మహిళల భద్రతపై ఆందోళన నెలకొంది.


# ఛాతీలో కత్తితో పోలీస్ స్టేషన్‌కు బాలుడు





**న్యూఢిల్లీ:** పదిహేనేళ్ల ఓ బాలుడిపై కొందరు కత్తితో దాడి చేశారు. ఛాతీలో దిగబడిన కత్తితో రక్తమోడుతూనే అతడు పోలీస్ ఠాణాకు చేరుకున్నాడు. వెంటనే పోలీసులు అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు శస్త్రచికిత్స చేసి, ఛాతీలో దిగి ఉన్న కత్తిని విజయవంతంగా తొలగించి, బాలుడి ప్రాణాలు కాపాడారు. విచారణ జరిపిన పోలీసులు నిందితులైన ముగ్గురు బాలురను అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 4వ తేదీన ఢిల్లీలోని పహార్‌గంజ్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సుమారు 15 రోజుల క్రితం నిందితుల్లో ఒకరిని కొందరు బాలురు కొట్టారు. దీని వెనుక ఉన్నది బాధిత బాలుడేనని నిందితుల అనుమానం. ఇదే కారణంతో ఆ బాలుడిని స్కూలు వద్ద ముగ్గురూ అడ్డుకున్నారు. పగిలిన బీర్ బాటిల్‌తో పొడుస్తానంటూ ఒకడు బెదిరించగా, అదే సమయంలో మరొకడు కత్తితో ఛాతీపై పొడిచాడు. ఆ వెంటనే బాలుడు పహార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు రాగా, పోలీసులు కేసు నమోదు చేశారు. మరికొన్ని గంటల్లో ఆరాంబాగ్ ప్రాంతంలో ఉన్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారు వాడిని కత్తిని, పగిలిన బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

# ముదిరిన ఆప్- బీజేపీల వరద రాజకీయం..

**చండీగఢ్:** పంజాబ్‌ను భారీ వర్షాలు, వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. వేలాది ఎకరాల్లో పంటనష్టం జరిగింది. నిరాశ్రయులైనవారి సంఖ్య అధికంగానే ఉంది. దీంతో వరద బాధితులు ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న బీజేపీ ఆప్‌లు బాధితులకు సాయం అందిస్తూ.. 2027 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు నిచ్చెన వేసుకునే ప్రయత్నాలు చేస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పంజాబ్‌లో వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించారు. అమృత్‌సర్, గురుదాస్‌పూర్, కపుర్తలాలోని పలు గ్రామాలను సందర్శించిన ఆయన ప్రధాని నరేంద్ర మోదీ సూచనల మేరకు, తాను రాష్ట్రానికి వచ్చానన్నారు. 'పంజాబ్‌లో సంభవించిన వరదలను సమీక్షించేందుకు ప్రధాని నన్ను పంపారు. మేము పంజాబ్‌కు అండగా నిలుస్తున్నాం' అని ఆయన అన్నారు. వరదలు పలు పంటలను నాశనం చేశాయని, తదుపరి సీజన్ సాగుకు కూడా ముప్పు కలిగించాయని ఆయన అన్నారు. తాను ఒక మంత్రిగా ఇక్కడికి రాలేదని, పంజాబ్ రైతుల సేవకునిగా వచ్చాయని శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. అయితే శివరాజ్ సింగ్ మాటలకు స్పందించిన అధికార అప్ నేతలు 2023లో హిమాచల్‌లో కురిసిన భారీ వర్షాలు, వరదలు పంజాబ్‌ను అతలాకుతలం చేసినప్పుడు కేంద్ర మంత్రులెవరూ రాష్ట్రంలో పర్యటించలేదని, ఆ సమయంలో బీజేపీ ముందుకొచ్చి ఎందుకు వరద సహాయక చర్యలు చేపట్టలేదని ప్రశ్నిస్తున్నారు. 2024-25 కేంద్ర బడ్జెట్‌లో బీహార్‌కు వరద ఉపశమనంగా రూ.11,500 కోట్లు కేటాయించినప్పటికీ, పంజాబ్‌కు కేవలం ప్రకటన మాత్రమే చేశారని ఆప్ నేతలు ఆరోపించారు. అయితే ప్రస్తుత వరదల సమయంలో మేమున్నామంటూ బీజేపీ నేతలు వస్తున్నారని ఆప్ నాయకులు ఆరోపిస్తున్నారు. కాగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సునీల్ జాఖర్ స్వయంగా ట్రాక్టర్‌ను నడిపి, చౌహాన్‌ను వరద ప్రభావిత గ్రామాలకు తీసుకెళ్లారు. జలంధర్‌లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ ట్రక్కుపై సహాయ సామగ్రిని లోడ్ చేస్తూ, తన భుజాలపై రేషన్ సంచులను మోసుకెళ్లారు.



# రాముడిగా..?



మహేశ్‌బాబు వెండితెరపై రాముడిగా కనిపించనున్నారట. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా అంతర్జాతీయ స్థాయిలో ఓ భారీ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ ఫారెస్ట్ యాక్షన్ అడ్వెంచరస్ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం కెన్యా దేశంలోని నైరోబీలో జరుగుతోంది. ఇటీవల మొదలైన ఈ లాంగ్ షూటింగ్ షెడ్యూల్ నెల రోజులకు పైనే ఉంటుందట. అయితే చిన్న గ్యాప్ రావడంతో ప్రస్తుతం మహేశ్‌బాబు హైదరాబాద్ చేరుకున్నారని, త్వరలోనే మళ్లీ నైరోబీకి వెళ్తారనే టాక్ వినిపిస్తోంది.

కాగా రామాయణం ఇతిహాసం నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని, ఈ చిత్రానికి 'జెన్ 63' అనే టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారనే టాక్ తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమా కథనం విభిన్న కాల మానాల్లో జరుగుతుందని, ఇందులో భాగంగా కొన్ని సన్నివేశాల్లో రాముడి పాత్రలో మహేశ్‌బాబు కనిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. ఇక ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో కేఎల్ నారాయణ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 120కి పైగా దేశాల్లో ఈ చిత్రం 2027లో విడుదలవుతుందనే ప్రచారం జరుగుతోంది.

# బ్రహ్మరాక్షస పట్టాలెక్కేదెప్పుడో?



పానిండియా స్టార్ ప్రభాస్ సినిమాల లైనప్ మామూలుగా లేదు. ఇప్పటికే ది రాజాసాబ్, ఫౌజీ సినిమాలు సెట్స్‌పై ఉన్నాయి. స్పిరిట్, కల్కి 2, సలార్ శౌర్యాంగపర్వం చిత్రాలు వెయిటింగ్‌లో ఉన్నాయి. ఇవిగాక నేనూ ఉన్నానంటున్నారు దర్శకుడు ప్రశాంత్ వర్మ. అసలు ఇంత బిజీగా ఉన్న ప్రభాస్.. ప్రశాంత్‌వర్మకు ఓకే చెప్తాడా? అనేది ఫిల్మ్ వర్గాల్లో నెలకొని ఉన్న ప్రశ్న. అయితే.. తాను ప్రభాస్‌తో సినిమా చేయబోతున్నట్టు రీసెంట్‌గా క్లారిటీ ఇచ్చారు ప్రశాంత్‌వర్మ. 'ప్రస్తుతానికి ఆ ప్రాజెక్ట్‌పై పెద్దగా మాట్లాడేదేంలేదు. మేమైతే షూటింగ్ కోసం రెడీగా ఉన్నాం. హీరోగారి డేట్స్ దొరకడమే తరువాయి. పట్టాలెక్కించేస్తాం' అన్నారాయన. ఇప్పటికే ఆయన 'బ్రహ్మరాక్షస' అనే కథను ప్రభాస్‌కి వినిపించినట్టు విశ్వసనీయ సమాచారం. ప్రభాస్ కూడా ఓకే చెప్పారట. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రభాస్ నుంచి గ్రీన్ సిగ్నల్ రావడానికి రెండుమూడేళ్లు పట్టడం ఖాయం. ఈ లోపు 'జై హనుమాన్' ఎలాగూ ఉంది. ప్రశాంత్‌వర్మ యూనివర్స్‌లో దటీజ్ మహాలక్ష్మి, అధీరా, మహాకాళి లైన్లో ఉన్నాయి. వీటి తర్వాత 'బ్రహ్మరాక్షస' మొదలవుతుందన్నమాట.

# ఈ జర్నీ ఎంతో దారుణం



బిజీ అయితే.. టైమ్ దొరకదు. టైమ్ దొరుకుతుందంటే బిజీ కాదని అర్థం. బిజీ కాకపోతే ఓ బాధ. బిజీ అయి టైమ్ దొరక్కపోతే ఓ బాధ. అదే డెస్టినీ. భగవంతుడు ఏదీ పూర్తిగా ఇవ్వడు. రష్మిక మందన్నా ఇటీవల పెట్టిన పోస్ట్ ఈ వేదాంతాన్ని గుర్తుచేసేలా ఉంది. 'తెల్లవారు జామున 3గంటల 50 నిమిషాలకు ఫ్లైట్. అంటే.. రెండు గంటల ముందే ఎయిర్‌పోర్ట్‌లో ఉండాలి.ఈ జర్నీ ఎంతో దారుణం.. అసలు ఇది పగలో రాత్రో అర్థం కావడంలేదు.' అంటూ ఫ్లైట్ విండో లోంచి తీసిన ఓ ఫొటోను షేర్ చేశారు రష్మిక. అయితే.. ఈ ప్రయాణం ఎక్కడికి? ఎన్ని గంటలు? అనే విషయాన్ని మాత్రం రివీల్ చేయలేదు. ఈ పోస్ట్ చూసినవారంతా.. 'లైమ్‌లైట్లో ఉన్నంతవరకే ఈ అదృష్టం.. ఆ తర్వాత కోరుకున్నారాదు..' అంటూ సెటైర్లు వేస్తున్నారు.



# థ్రిల్లింగ్‌గా ఉంది

బాలీవుడ్ దర్శక–నిర్మాత విక్రమాదిత్య మొత్వాని, నటి సన్నీ లియోన్ అంతర్జాతీయ స్థాయిలో ఓ బయోపిక్ చేయనున్నారు. వెబ్ సిరీస్‌గా రానున్న ఈ బయోపిక్ హక్కులు సన్నీ లియోన్‌కి చెందిన సన్‌సిటీ సంస్థ దక్కించుకుందట. దీంతో విక్రమాదిత్య మొత్వానికి చెందిన ఆండొలన్ ఫిల్మ్స్, సన్నీ లియోన్ 'సన్ సిటీ' సంస్థలు ఈ అంతర్జాతీయ బయోపిక్‌ను రూ పొందించనున్నాయి. "ఈ ప్రాజెక్ట్ కోసం అసోసియేట్ అవుతున్నందుకు చాలా థ్రిల్లింగ్‌గా ఉంది. ఈ బయోపిక్‌లోని స్టోరీ నన్ను ఇన్‌స్పైర్ చేసింది" అని సన్నీ లియోన్ పేర్కొన్నారు. ఇక... ఇది ఎవరి బయోపిక్? ఇందులో నటీనటులు ఎవరు? సన్నీ లియోన్ కూడా ఈ సిరీస్‌లో నటిస్తారా? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com